



మీకు అండగా మేమున్నాం.. మాకు అండగా మీరున్నారు.. మీకు కష్టం వచ్చిందంటే మేం తట్టుకోలేం.. మాకు కష్టం వచ్చిందంటే మీరు తట్టుకోలేరు.. అందుకే చంద్రబాబును అక్రమంగా స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టు చేసి జైలులో పెడితే తట్టుకోలేక వందలాది మంది తుదిశ్వాస విడిచారని ఎన్టీఆర్ ట్రస్టు చైర్‌పర్సన్, చంద్రబాబు సతీమణి భువనేశ్వరి అన్నారు. 'నిజం గెలవాలి' పేరిట చేపట్టిన యాత్రలో భాగంగా బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గురువారం ఆమె ఏడు బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి పరామర్శించి ఓదార్చారు. ఒక్కొక్కరికీ రూ.3 లక్షల చొప్పున చెక్కులు అందించారు. తొలుత అమలాపురంలోని సత్యనారాయణ గార్డెన్స్‌లో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి గంటి హరీష్ మాధుర్, మాజీ ఎమ్మెల్యేలు అయితా బత్తుల ఆనందరావు, బండారు సత్యానందరావు, చిల్లా జగదీశ్వరి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర నేతలు మెట్ల రమణబాబు, అల్లాడ స్వామినాయుడు తదితరులు భువనేశ్వరిని కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.
- (అమలాపురం/ఆంధ్రజ్యోతి)

కన్నీళ్లు రాకుండా చూస్తాం : ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి గ్రామానికి చెందిన సలాది విశ్వనాథం భార్య ఆదిలక్ష్మి భువనేశ్వరిని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. ఆమెను పక్కనే కూర్చుని భువనేశ్వరి ఓదార్చారిలా..



బాధపడకండి..
మేమున్నాం!

బాధిత కుటుంబీకుల కన్నీళ్లు తుడిచి.. బాసటగా నిలిచి..

- కోనసీమలో 7 కుటుంబాలకు పరామర్శ
- అండగా ఉంటామని భువనేశ్వరి భరోసా
- రూ.3 లక్షల చొప్పున చెక్‌ల అందజేత

అల్లవరంలో.. సుబ్బరాజు కుటుంబానికి..



అల్లవరం, జనవరి 25 : మండలంలోని రెల్లుగడ్డ గ్రామానికి చెందిన టీడీపీ వీరాభిమాని, ఉపాధి కూలీ నడింపల్లి సుబ్బరాజు గతేడాది అక్టోబరు 1న చంద్రబాబు అరెస్టు వార్తను టీవీలో చూసి గుండెపోటుతో మృతిచెందాడు. అతడి కుటుంబీకులను భువనేశ్వరి గురువారం పరామర్శించి ఓదార్చారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, పెచ్చెట్టి చంద్రమౌళి, మాజీ జడ్పీటీసీ వేగిరాజు ప్రమీల, పెచ్చెట్టి విజయలక్ష్మి, డాక్టర్ సత్యశ్రీ, వేగిరాజు వెంకట్రాజు, చిక్కాల గణేష్ పాల్గొన్నారు.

చల్లపల్లికి వెళ్లి.. ఓదార్చి..

ఉప్పలగుప్తం : చంద్రబాబు జైల్లో ఉండగా ఆందోళనతో మృతి చెందిన చల్లపల్లి గ్రామానికి చెందిన సలాది విశ్వనాథం భార్య ఆదిలక్ష్మి, ముగ్గురు కుమార్తెలను భువనేశ్వరి పరామర్శించి ఓదార్చారు. ఆమె వెంట టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మకాయల చెల్లయ్యనాయుడు, సర్పంచ్ ఇసుకపట్ల జయమణీరఘుబాబు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అరిగెల నానాజీ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మాజీ జడ్పీటీసీ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, గొలకోటి చిన్నా, పోలిశెట్టి శివాజీ, దంగేటి రవీంద్రనాథ్, బూసి బుజ్జిదొర, పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

నేడు టూర్ ఇలా...

నిడదవోలు/బిక్కవోలు, జనవరి 25 : 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తూర్పుగోదావరి జిల్లాలో నారా భువనేశ్వరి పర్యటించనున్నారు. మండపేటలో గురువారం రాత్రి ముగించుకుని బిక్కవోలు మండలం బలభద్రపురం ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాలులో బస చేశారు. శుక్రవారం ఉదయం బిక్కవోలులోని శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుంటారు. అనంతరం అదే గ్రామానికి చెందిన రొక్కల రాణి కుటుంబీ కులను పరామర్శిస్తారు. నిడదవోలు మండలం చేరుకుని పందలపర్రు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బోగిరెడ్డి సత్యనారాయణ (బూరయ్య), తిమ్మరాజుపాలెంలో కుసుమే వెంకటలక్ష్మి, కలవచర్లకు చెందిన మన్నెం శ్రీనివాసరావు కుటుంబీకులను ఓదార్చుతారు. చాగల్లు మండలం బ్రాహ్మణగూడెంలో మరొక కుటుంబాన్ని పరామర్శిస్తారు.

ఎస్ మూలపాలెం వెళ్లి.. పరామర్శించి



అయినవిల్లి: మండలంలోని ఎస్.మూలపొలం గ్రామానికి చెందిన మోరంపూడి మీరాసాహెబ్ కుటుంబ సభ్యులను భువనేశ్వరి పరామర్శించారు. అండగా ఉంటామని, అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. ఆమె వెంట మతుకుమిల్లి లక్ష్మణరావు, సూర్యకుమారి, సర్పంచ్ బొబ్బా ప్రభాత్‌కుమార్, మతుకుమిల్లి బాబూరావు, మందపాటి కిరణ్ కుమార్, సలాది పుల్లయ్యనాయుడు తదితరులు ఉన్నారు.

గూడపల్లి వెళ్లి కన్నీళ్లు తుడిచి..



రాజోలు: మండలంలోని గూడపల్లికి చెందిన సరెళ్ల పెద్దిరాజు కుటుంబీకులను భువనేశ్వరి పరామర్శించారు. ఆమె వెంట మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, టీడీపీ రాజోలు నియోజకవర్గ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు, ఎంపీపీ కేతా శ్రీను, మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, ముప్పర్తి నాని, వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, చాగంటి సామి, బోళ్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నల్లూరు వెళ్లారు.. ఓదార్చారు..



కపిలేశ్వరపురం : మండలంలోని నల్లూరులో జొన్నకూటి రాజు కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించారు. టీడీపీ అన్నా, చంద్రబాబు అన్నా రాజుకు అమితమైన ప్రేమ, అభిమానమని, ఎప్పుడూ చంద్రన్ననే తలుస్తూనే ఉండేవాడని కుటుంబీకులు భువనేశ్వరికి వివరించారు. ఆమె వెంట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, వి.సాయి కుమార్‌బాబు, ముత్యాల వెంకట్రావు, పుత్సల శ్రీనివాస్, పువ్వల చిట్టిబాబు, నెక్కంటి బాలకృష్ణ పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



మలికిపురం : విశ్వేశ్వరాయపురం గ్రామానికి చెందిన చెల్లుబోయిన నరసింహ మూర్తి కుటుంబీకులను భువనేశ్వరి పరామర్శించారు. 'నవంబరు 9న టీవీ ఆన్‌చేసి చంద్రబాబు అరెస్టు వార్త చూసి కుప్పకూలారని మృతుడి కుమారుడు చంద్రకాంత్ తెలిపారు. ధైర్యంగా ఉండాలని, టీడీపీ అండగా ఉంటుందని భువనేశ్వరి వారికి భరోసా ఇచ్చి రూ.3 లక్షల చెక్కు అందించారు. ఆమె వెంట మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, గ్రామ సర్పంచ్ చెల్లుబోయిన హెలీనా, సఖినేటిపల్లి టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముప్పర్తి నాని, మంగెన భూదేవి, బందెల పద్మ, కాండ్రేగుల భవానీలావణ్య తదితరులు పాల్గొన్నారు.

పాలతోడు.. మేము మీకు తోడు..



మండపేట : మండలంలోని పాలతోడులో మందపల్లి ధర్మరాజు కుటుంబీకులను భువనేశ్వరి పరామర్శించారు. ఆయన సతీమణి జ్యోతితో పాటు పిల్లలు వినీల, ప్రమీల కుమారుడు వరుణ్‌తో భువనేశ్వరి మాట్లాడి ధైర్యం చెప్పారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక తమ కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలని బాధిత కుటుంబం కోరగా భువనేశ్వరి సానుకూలంగా స్పందించారు. ఆమె వెంట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వల్లూరి సాయికుమార్‌బాబు, నల్లమిల్లి వీర్రెడ్డి, వాదా ప్రసాదరావు, యరగతపు బాబ్జీ, పాలతోడు మాజీ సర్పంచ్ పిల్లా పద్మవెంకట్రాజు ఉన్నారు.



కాకినాడలో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

కష్టపడితే అధికారం
కాంగ్రెస్‌దే!

- అసెంబ్లీ ఎన్నికలు దగ్గరకొస్తున్నందున అందరూ కష్టపడి పనిచేయాలి
- ప్రతి ఇంటి తలుపుతట్టి కేడర్‌ను పార్టీలోకి ఆహ్వానించాలి
- ఉమ్మడి జిల్లా పార్టీ కార్యకర్తల సమావేశంలో పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల

కాకినాడ సిటీ, జనవరి25: అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపునిచ్చారు. నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రతి ఇంటి తలుపుతట్టి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించాలని దిశానిర్దేశం చేశారు. కాకినాడ సూర్యకళామందిరంలో గురువారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పీసీసీ చీఫ్ షర్మిల కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ క్రమేపీ పెరుగుతోందని, దీనిని ఓట్లుగా మల్చుకోగలిగితే తప్పకుండా అధికారంలోకి వస్తామని పేర్కొన్నారు. విభజన హామీలు అమలుచేసి రాష్ట్రానికి న్యాయం చేసేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ప్రారంభమైతే ఇప్పటివరకు ప్రభుత్వాలు దీన్ని పూర్తిచేయలేదని ధ్వజమెత్తారు.రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా శూన్యమని, అరాచక, రాక్షస పాలన నడుస్తోందని ధ్వజమెత్తారు. వైసీపీతోపాటు ప్రతి పక్ష టీడీపీ ఎంపీలు రాష్ట్రంలో ఒక ఎమ్మెల్యే ఒక ఎంపీ సీటు కూడా గెలవని బీజేపీకి బానిసలుగా మారిపోయారని మండిపడ్డారు. రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ ద్వారానే సంక్షేమ, సుస్థిర పాలన అందు తుందని అందుకే కాంగ్రెస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కోరుకున్న ఆంధ్రప్రదేశ్ ఇది కాదని, విభజన హామీలలో పొందుపరిచిన విధంగా ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, కొత్త పరిశ్రమల ఏర్పాటుతో ఆవిష్కృతం కావాలని సోనియా, రాహుల్ భావించారన్నారు.సీడబ్ల్యుసీ సభ్యుడు జేడీ శీలం మాట్లాడుతూ పార్టీ శ్రేణులు మండల,గ్రామ, బూత్ లెవెల్ కమిటీలు ఏర్పాటు చేయాల న్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి త్వరలోనే మంచిరోజులు రాబోతున్నట్టు చెప్పారు. ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో దోచుకోవడం, దాచుకోవడం తప్పించి పరిపాలన లేదన్నారు. సీడబ్ల్యుసీ సభ్యుడు మల్లిపూడి మంగపతి పళ్లంరాజు మా ట్లాడుతూ పదేళ్ల కాంగ్రెస్ పాలనలో సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి సమాంతరంగా జరిగాయని వివరించారు. కానీ ఇప్పుడు అదంతా మాయమైపోయిందన్నారు. ఈ సమావేశంలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు జంగా గౌతమ్, సుంకర పద్మశ్రీ, పీసీసీ మాజీ అధ్యక్షుడు ఎన్ రఘువీరారెడ్డి, ఏఐసీసీ సభ్యుడు మల్లిపూడి రాంబాబు, కోనసీమ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, రాజమహేంద్రవరం జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, పీసీసీ ఉపాధ్యక్షుడు మట్టా ప్రసాద్, పీసీసీ ప్రధాన కార్యదర్శులు ఆకుల వెంకటరమణ, రాజమహేంద్రవరం సిటీ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లితో వైఎస్ షర్మిల భేటీ

రాజమహేంద్రవరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల గురువారం రాజమహేంద్రవరంలోని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్ ఇంటికి వచ్చారు. మాజీ పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి, మాజీ కేంద్రమంత్రి పల్లంరాజు, జేడీ శీలం, మాజీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తదితరులు ఆమె వెంట ఉన్నారు. ఉండవల్లితో ఆమె ప్రత్యేకంగా సమావేశమై పలు విషయాలు చర్చించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మర్యాదపూర్వకంగా అరుణకుమార్‌ని కలిశానన్నారు. అనంతరం ఉండవల్లి స్పందిస్తూ వైఎస్ కుమార్తెగా ఆమె తనను మర్యాదపూరకంగా కలవడానికి వచ్చారన్నారు. కాకినాడ నుంచి వెళుతూ రాజమహేంద్రవరం వచ్చారన్నారు. ఆమెలో వైఎస్ఆర్ చొరవ కనిపిస్తోందని వ్యాఖ్యానించారు.

ఆర్టీసీకి సంక్రాంతి ఆదాయం రూ.88,50,606

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 25 : సంక్రాంతి పండుగ నేపథ్యంలో జిల్లా ఆర్టీసీకి ఈ ఏడాది రూ.88 లక్షల 50 వేల 606ల ఆదాయం లభించిందని ఆర్టీసీ జిల్లా అధికారిణి కె.షర్మిలా అశోక గురువారం తెలిపారు. జిల్లాలోని మొత్తం నాలుగు డిపోల నుంచి హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాలకు 377 స్పెషల్ సర్వీసులు నడిపామన్నారు. 30,319 మంది ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేర్చినట్టు తెలిపారు. రాజమహేంద్రవరం డిపో రూ.64,09,719, గోకవరం డిపో రూ.12,08, 472లు, కొవ్వూరు డిపో రూ.7,70,956లు, నిడదవోలు డిపో రూ.4,61,459ల ఆదాయం దక్కిందన్నారు.

టీచర్ ఖాతా నుంచి లక్ష స్వాహా

రాజమహేంద్రవరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఓ టీచర్ ఖాతా నుంచి దుండగులు రూ.97 వేలు స్వాహా చేశారు. రెహ్మత్‌నగర్‌కి చెందిన సుజాత డబ్బు అవసరంతో ఏటీఎం నుంచి డ్రా చేసి తీసుకురావాలని ఆమె కుమార్తెకు డెబిట్ కార్డు ఇచ్చి పంపారు. చిన్నారి షెల్టాన్ జంక్షను సమీపంలోని బొల్లినేని ఆస్పత్రి రోడ్డులోని ఏటీఎంకి వెళ్లింది. డబ్బు డ్రా చేసిన సమయంలో సరిగా తెలియకపోవడంతో అదే అదనుగా అక్కడే ఉన్న దుండగుడు గమనించి ఆ అమ్మాయికి అవసరమైన డబ్బు డ్రా చేసి ఇచ్చి కార్డు మార్చేశాడు. సాయంత్రానికి ఖాతా నుంచి రూ.97వేలు మాయమైనట్లు మెసేజ్‌లు రావడంతో బొమ్మూరు పోలీసులను సుజాత ఆశ్రయించారు.కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎండీ ఉమర్ తెలిపారు.

వచ్చే నెల 10,11 తేదీల్లో బాలోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 25 : రెండో గోదావరి బాలోత్సవం వచ్చే నెల 10,11వ తేదీల్లో ఎస్‌కేవీటీ డిగ్రీ కాలేజీలో నిర్వ హించనున్నట్టు బాలోత్సవ అసోసియేట్ అధ్యక్షుడు వీఎస్ఎస్ కృష్ణకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.తులసీ తెలిపారు.రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల తో మాట్లాడారు. బాలోత్సవానికి ఎం పిక చేసిన రాజమహేంద్రవరంతో పాటు ఆరు మండలాల్లోని 700 పాఠ శాలల్లో రెండో తరగతి నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు.మురళీకృష్ణ,కాశీవిశ్వనాథ్, కామేశ్వరశర్మ పాల్గొన్నారు.

29న కాతేరులో తెలుగుదేశం పిలుస్తోంది
రా కదలిరా



కోరుకొండ మండలం మధురపూడిలోని బీవీఆర్ చౌదరి క్యాంప్ కార్యాలయంలో బహిరంగ సభ ఏర్పాట్లపై చర్చిస్తున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టీడీపీ నాయకులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)
టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 29న రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం పరిధి కాతేరులో తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా బహి రంగ సభను నిర్వహిస్తారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల కార్యకర్తలు, ప్రజలు సభకు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. తిరుమల కాలేజీ ఎదురుగా సుమారు 23 ఎకరాల స్థలంలో బహిరంగ సభ నిర్వహిస్తారు. దానికి సమీపంలో 13 ఎకరాల స్థలంలో పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. వాటి ఎదురుగా గల మూడు ఎకరాల స్థలంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేస్తున్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీభర్త ఆదిరెడ్డి వాసు, రాజానగరం ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి(బీవీఆర్‌చౌదరి) తదితరులు పరిశీలించారు. అంతకు ముందు బూరుగుపూడి గేట్ వద్ద గల టీడీపీ ఆఫీసులో ముఖ్యనేతల సమావేశం జరిగింది. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, శాసనమండలి విపక్షనేత యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ టీడీపీ ఎన్నికల ముందు రాజమహేంద్రవరంలో భారీ బహిరంగసభ నిర్వహించడం సంప్రదాయంగా వస్తుందన్నారు. ఈసభ సక్సెస్‌తో పార్టీ అధికారంలోకి వస్తుందనేది ఓ సెంటిమెంట్‌గా కూడా మనం చూస్తుంటామన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు ఈ సభను సక్సెస్ చేయడానికి కృషి చేయాలన్నారు.ఇక మధ్యలో రెండు రోజుల సమయమే ఉండడం వల్ల అన్ని ఏర్పాట్లు చకచకా జరగాలని, పార్కింగ్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ కాతేరులో సభ నిర్వహించడం వల్ల జిల్లా నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు అధికంగా రావడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ ఆరోజు ఉదయం 10గంటలకే సభ మొదలవుతుందన్నారు. సుమారు 2లక్షల మంది ప్రజలు వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. ఉదయం పూట జరిగే సభ కాబట్టి వచ్చిన వారందరికీ భోజనం సౌకర్యం కూడా ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. భోజనాలు వద్ద ఇబ్బంది లేకుండా సభకు అన్ని వైపులా నియోజకవర్గాల వారీ ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనేది కూడా చర్చించారు. సభ కోసం ఇన్‌చార్జిలు, పరిశీలకులను నియమించారు.అనపర్తి ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరావు, పరిశీలకుడిగా మోకా ఆనందసాగర్, రాజానగరం ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, పరిశీలకుడిగా ధూళిపూడి వెంకటరమణ, రాజమహేంద్రవరం సిటీ ఇన్‌చార్జిగా రెడ్డి సుబ్రహ్మణ్యం, పరిశీలకురాలిగా మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి, రాజమహేంద్రవరం రూరల్ ఇన్‌చార్జిగా మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, పరిశీలకుడిగా అంగర రామ్మోహన్, కొవ్వూరు ఇన్‌చార్జిగా మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, పరిశీలకుడిగా గొర్లె శ్రీధర్, నిడదవోలు ఇన్‌చార్జిగా వలవల బాబ్జి, పరిశీలకుడిగా వివిఎల్ సూర్యనారాయణరాజు, గోపాలపురం ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, పరిశీలకుడిగా కటకంశెట్టి ప్రభాకర్ నియమితులయ్యారు.

నేడు 75వ గణతంత్ర దినోత్సవం



రాజమహేంద్రవరం ముప్వన్నెల విద్యుద్దీపకాంతుల మధ్య రైల్వేస్టేషన్

రాజమహేంద్రవరం, జనవరి 26(ఆంధ్రజ్యోతి) : భారత 75వ గణతంత్ర దినోత్సవం జిల్లా స్థాయి వేడుకలకు ఆర్ట్స్ కాలేజి వేదిక కానుంది. ఈ మేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శకటాలను సిద్ధం చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు కలెక్టర్ మాదవీలత జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. ఉత్తమ అధికారులకు అవార్డులు ఇవ్వనున్నారు.



ఘనంగా ఓటర్ల దినోత్సవం

జాతీయ ఓటర్ల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీ చేశారు. ర్యాలీని కలెక్టర్ మాదవీలత జెండా ఊపి ప్రారంభించారు. ఓటు వజ్రాయుధమని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆలోచించి ఓటేయాలని సూచించారు. అనంతరం పలువురు ఓటర్లను సత్కరించారు. ర్యాలీలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'సత్ప్రవర్తనతో ఉన్న ఖైదీలకు క్షమాభిక్షను దూరం చేయడం ఏ మాత్రం సబబు కాదు. మంచి ప్రవర్తనతో ఉన్నవారికి మరో సారి బాగా జీవించే అవకాశం కల్పించడం సరైన నిర్ణయమే' - సుప్రీంకోర్టు



'మీరు మంచిగా మారండి. బయటకు వెళ్లిన తర్వాత మీ కుటుంబాలతో గౌరవంగా, సంతోషంగా బతకాలి. మళ్లీ నేరాలు చేయకూడదు. క్షమాభిక్ష జీవోల కోసం ఒత్తిడి పడొద్దు. నేనున్నాను. వాటి సంగతి నేను చూసుకుంటాను'

- రాజమహేంద్రవరం జైలులో ఆసుపత్రి శంకుస్థాపనకు వచ్చినప్పుడు ఖైదీలతో ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు

ఖైదీలకు మళ్లీ కన్నీరేనా!

- విడుదల కోసం జైలు పక్షుల ఎదురు చూపులు
- గణతంత్ర దినోత్సవానికి క్షమాభిక్షపై అయోమయం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

'క్షమ' లేని పాలకుల దయా'భిక్ష' దొరక్క సత్ప్రవర్తన కలిగిన ఎందరో ఖైదీలు జైళ్లలోనే మగ్గిపోతున్నారు. క్షమాభిక్ష జీవో కోసం చివరి క్షణం వరకూ ఎదురుచూడటం.. ప్రభుత్వం కనికరం చూపకపోవడంతో నిరాశ నిండిన గుండెలతో కన్నీటిని దిగమింగుకొంటూ.. ఆహారం సయించక.. కంటిపై కునుకు రాక.. ఇటు ఖైదీలు.. అటు వారి కుటుంబాలు తీవ్ర మానసిక ఒత్తిడిలో మునిగిపోతున్నాయి. అయినా ప్రభుత్వానికి ఇవేమీ పట్టడం లేదు. గత ప్రభుత్వంలో సమయానికి క్షమాభిక్ష జీవోలు జారీ అయ్యేవి. అయితే జగన్ ప్రభుత్వం వచ్చాక గత నాలుగున్నరేళ్లలో ఒక్కసారి మాత్రమే జీవో ఇచ్చారు. జైలు అధికారులు ఎంత వేగంగా ప్రక్రియ పూర్తిచేసి జాబితాను పంపుతున్నా నెలల తరబడి తాత్సారం జరుగుతోంది. పాలకుల నిర్దయతో గతేడాది ఆగస్టు 15న విడుదల కావాల్సిన జీవిత ఖైదీల జాబితా ఇంకా సర్కారు వద్దే నానుతోంది. దీంతో ఈ గణతంత్ర దినోత్సవానికి వెలువడే నిర్ణయం జైళ్లలోని జీవిత ఖైదీలు ఎదురు చూస్తున్నారు.

రాజమహేంద్రవరం జైలులో...

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జైలులో జీవిత ఖైదు అనుభవిస్తున్న వారిలో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందినవారు ఉన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం 2023 మార్చి 16న జీవో 58 ఇచ్చింది. దీని ప్రకారం ఏడాదికి మూడు విడతల్లో ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం వడపోత అనంతరం 34మంది క్షమాభిక్షకు అర్హులని జైలు అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. వీరంతా గత ఆగస్టులోనే విడుదల కావాల్సి ఉంది. హైపవర్ కమిటీ సమావేశం పూర్తయి సుమారు 3 నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఇప్పటికీ ఆ జాబితాను కేబినెట్‌లో పెట్టలేదు.

ప్రభుత్వం తీరుతో అన్యాయం


గత ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు క్షమాభిక్ష జీవోలు జారీ అయ్యేవి. రెండేళ్లకోసారైనా పెద్దసంఖ్యలో ఖైదీలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకునేవారు. కానీ జగన్ ప్రభుత్వంలో వారికి ఎదురుచూపులే మిగిలాయి. గడిచిన నాలుగున్నరేళ్లలో ఒక్కసారి మాత్రమే క్షమాభిక్షపై ఖైదీలను విడుదల చేశారు. అప్పట్లో సెంట్రల్ జైలు, మహిళా ప్రత్యేక జైలులో కలిపి సుమారు 60 మందికి పైగా బయటకు వెళ్లారు. అక్కడా వారికి అన్యాయమే జరిగింది. 2021లో విడుదలకు సుముఖత వ్యక్తం చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. కానీ ఖైదీలను వెంటనే విడుదల చేయలేదు. ఏడాది ఆలస్యంగా 2022 ఆగస్టు 15న బయటకు వదిలారు. మరో అన్యాయం ఏమిటంటే.. 2022లో వదిలిన ఖైదీలకు 2021ని కటాఫ్‌గా తీసుకున్నారు. అలాకాకుండా 2022నే కటాఫ్‌గా తీసుకుంటే మరికొంత మంది తమ కుటుంబాల చెంతకు చేరే అవకాశం లభించేది. ప్రభుత్వం తీరుతో ఆ ఖైదీలు ఏడాది శిక్ష అదనంగా అనుభవించారు.

ఖైదీ కుటుంబంపై ప్రతికూల ప్రభావం

సాధారణ జీవిత ఖైదీలకు 7ఏళ్ల శిక్ష, మూడేళ్ల రెమిషన్‌తో కలుపుకొని పదేళ్లు, 498(ఏ), డెకాయిటీ, దొంగతనాలు వంటి తీవ్రమైన నేరాల్లో 14+6, మహిళలకు 3+2, 65ఏళ్లు దాటినవారికి ఐదేళ్ల శిక్ష, రెండేళ్ల రెమిషన్‌తో ఏడేళ్లు పూర్తిచేస్తే, కొన్ని నిబంధనలకు లోబడి క్షమాభిక్షకు అర్హులవుతారు. ప్రస్తుతం 15ఏళ్లకు పైబడి శిక్ష అనుభవిస్తున్నవాళ్లు, రెమిషన్‌తో కలిపి 20ఏళ్లు దాటిపోయిన ఖైదీలు, 65ఏళ్లు నిండిన వృద్ధులు ఉన్నారు. క్షమాభిక్ష జీవో జారీలో తీవ్ర నిర్లక్ష్యంతో వారి కుటుంబాలపై ప్రతికూల ప్రభావం పడుతోంది. కొన్ని కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు అంతకుముందు ఎలాంటి నేర చరిత్ర ఉండదు. క్షణికావేశంలోనో, స్నేహితులతో వెళ్లి లేదా ఏదో గొడవ పెద్దదై నేరం జరిగి ఉంటుంది. అలాంటి కేసుల్లోని వారు కూడా ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గుతున్నారు. కొన్ని కేసుల్లో భార్య, భర్త ఇద్దరికీ శిక్ష పడటంతో వారి పిల్లలు అనాథలవుతున్నారు. దేశంలో సంచలనం రేకెత్తించిన కేసుల్లో సైతం క్షమాభిక్ష ప్రసాదిస్తున్నారని.. క్షణికావేశంలో నేరానికి పాల్పడినవారిపై మాత్రం దయ చూపట్లేదని ఖైదీల కుటుంబీకులు ఆవేదన చెందుతున్నారు. ఖైదీ సత్ప్రవర్తనను దృష్టిలో ఉంచుకొని క్షమాభిక్ష ప్రసాదించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రామయ్య దర్శనానికి రైలెప్పుడు?

- ప్రత్యేక రైళ్లు ఉన్నట్లా.. లేనట్టా..
- ప్రకటించినా.. రిజర్వేషన్లు తెరుచుకోలేదు
- అయోమయంలో రామభక్తులు
- స్పష్టత ఇవ్వని రైల్వే



టిక్కెట్స్‌కు ట్రై చేస్తే వస్తున్న మెసేజ్

రాజమహేంద్రవరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రామయ్య దర్శన భాగ్యం పొందాలని భక్తులు ఎదురుచూస్తున్నా రైల్వే శాఖ ప్రత్యేక రైళ్ల విషయంలో స్పష్టత ఇవ్వకపోవడంతో అయోమయం నెలకొంది. అయోధ్యకు నేరుగా వెళ్లడానికి 23న ప్రత్యేక రైలు ప్రకటించినా రిజర్వేషన్లు ఇంకా ఓపెన్ కాలేదు. అటు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైటులో వేలాదిగా భక్తులు వెతుకుతుండగా.. ఇటు రిజర్వేషన్ కౌంటర్ల వద్ద లైనులో నుంచుని తీరా రిజర్వేషన్ కావడం లేదని తెలియడంతో నిరాశతో భక్తులు వెనుదిరుగుతున్నారు. ప్రత్యేక రైలు కోసం భక్తులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. అయోధ్య వెళ్లడానికి ఈ ప్రాంతం నుంచి నేరుగా రైలు లేదు. విమాన సదుపాయం ఉండదు. ధనబాద్, ప్రయాగ్ రాజ్, వారాణసీ, లక్నో తదితర స్టేషన్లకు వెళ్లి అక్కడి నుంచి రైలు మారాల్సి ఉంటుంది. ఆయా రైళ్లకు సాధారణ ప్రయాణికులతో రిజర్వేషన్లూ నిండుకున్నాయి. ఒక వేళ ఆ రైళ్లకు వెళ్లాలన్నా టిక్కెట్లకు డబ్బులు కూడా కాస్త ఎక్కువగా వెచ్చించాల్సి ఉండడంతో పాటు ప్రయాణ సమయం, ప్రయాస కూడా ఎక్కువగానే ఉంటుంది. దీంతో నేరుగా వెళ్లే ప్రత్యేక రైలు కోసం ప్రయాణికులు ఎదురు చూస్తున్నారు. బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించిన 22వ తేదీన దేశం నలుమూలల నుంచి ఒకేసారి జనం అయోధ్యకు పోటెత్తితే ఇబ్బందులు తలెత్తుతాయనే ఉద్దేశంతో భక్తులను నియంత్రించడానికి రాష్ట్రాల వారీగా తేదీలు నిర్ణయించి ఆయా ప్రాంతాల నుంచి నేరుగా ప్రత్యేక రైలు సదుపాయం కల్పించాలని సంకల్పించారు. ఈ ప్రత్యేక రైళ్లను రానుపోను నడిపే విధంగా ప్రణాళికలు వేశారు. ఈ క్రమంలో అయోధ్య బాల రాముడిని దర్శించే భక్తుల సౌకర్యార్థం ఫిబ్రవరి 7, 10, 11, 14 తేదీల్లో రాజమండ్రి నుంచి అయోధ్యధామ్‌కి ప్రత్యేక రైలు 07217 నంబరుతో 22 కోచ్‌లతో నడుస్తుందని ప్రకటించారు. రాజమండ్రి నుంచి 7న సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి శుక్రవారం రాత్రి 11 గంటలకు అయోధ్యధామ్ చేరు తుందన్నారు. అదే రైలు ఫిబ్రవరి 10న అటు నుంచి బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 2గంటలకు రాజమండ్రి చేరే విధంగా షెడ్యూల్ చేశారు. సామర్లకోట నుంచి అయోధ్యధామ్‌కి 07218 రైలు 11న బయలుదేరుతుంది. ఈ రైళ్లకు అనపర్తి, సామర్లకోట, అన్నవరం, తుని, దువ్వాడ, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస మీదుగా అయోధ్యకు చేరుతుందని ప్రకటించారు. దీంతో ఈ ప్రాంతం నుంచి వెళ్లే భక్తులు పెద్ద సంఖ్యలో ప్రయాణానికి సిద్ధపడ్డారు. వాస్తవంగా ఏదైనా ప్రత్యేక రైలు ప్రకటించిన మరుసటి రోజు నుంచే రిజర్వేషన్ల సదుపాయం అందుబాటులోకి వస్తుంది. కానీ మూడు రోజులు గడిచినా అయోధ్య ధామ్ ప్రత్యేక రైళ్ల రిజర్వేషనపై ఒక క్లారిటీ రాలేదు. రైళ్లు ఉపసంహరించుకున్నారా? అనే విషయంపై కూడా స్పష్టత కొరవడింది. అయితే అయోధ్యలో ఇప్పటికే భక్తులు పోటెత్తడంతో ఒకానొక సమయంలో ఆలయ తలుపులు మూసేసి విడతల వారీగా దర్శనం కల్పిస్తున్నారు. అందువల్ల అయోధ్యలో భక్తుల సంఖ్య అంచనాల ప్రకారం తేదీలు ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఏదేమైనా ప్రత్యేక రైళ్లపై రైల్వే స్పష్టత ఇవ్వాలని భక్తులు కోరుతున్నారు. 22న ప్రాణ ప్రతిష్ఠకు ఈ ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలోనే భక్తులు వివిధ మార్గాల్లో వెళ్లారు. అటు నుంచి విమానానికి రావాలని ప్లాన్ చేసుకున్నవాళ్లు అక్కడ పొగమంచు కారణంగా విమానాలు రద్దు కావడంతో రైళ్లనే ఆశ్రయించాల్సి వస్తోంది. రైళ్ళలో రిజర్వేషన్లు దొరక్కపోవడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.



జాతీయ రహదారిపై నగదు దోపిడీ

గొల్లప్రోలు రూరల్, జనవరి 25: గొల్లప్రోలు మండల పరిధిలోని జాతీయ రహదారిపై సినీఫక్కీలో నగదు దోపిడీ జరిగింది. మోటార్ సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని పడగొట్టి అందులో ఉన్న నగదును చోరీ చేసి ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. మండలంలోని తాటిపర్తి గ్రామానికి చెందిన నల్లల వీరబాబు మినపప్పు వ్యాపారం చేస్తూ ఉంటారు. బుధవారం సాయంత్రం మోటార్‌సైకిల్‌పై బయలుదేరి సామర్లకోట, పెద్దాపురం, జగ్గంపేట, ఎర్రవరం ప్రాంతాల్లోని కిరాణా దుకాణాల వద్దకు వెళ్లి ఇచ్చిన సరుకుకు నగదు వసూలు చేసుకున్నారు. వసూలయిన రూ.1.90 లక్షలను మోటార్‌సైకిల్ బ్యాగ్‌లో ఉంచుకుని రాత్రి ఇంటికి బయలుదేరారు. జాతీయ రహదారి 16పై ప్రయాణిస్తూ వన్నెపూడి జంక్షన్ వీఎల్ ఆగ్రో ఫ్యాక్టరీ వద్దకు వచ్చేసరికి పక్క నుంచి మరో మోటార్‌సైకిల్ వేగంగా రావడంతో అతను మోటార్‌సైకిల్‌తో పాటు కింద పడిపోయాడు. వెంటనే ఇద్దరు వ్యక్తులు వచ్చి మోటార్‌సైకిల్ ట్యాంక్ కవర్‌లో ఉన్న బ్యాగ్‌తో పాటు అందులో ఉన్న రూ.1.90 లక్షలను తీసుకుని పరారయ్యారు. దీనిపై వీరబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నల్లజర్ల అటవీ ప్రాంతంలో పెద్దపులి



సీసీ కెమెరాకు చిక్కిన పులి

నల్లజర్లజనవరి 25 : ఉభయగోదావరి జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతం నల్లజర్ల మండలం పుల్లలపాడు, చీపురుగూడెం గ్రామాల్లో పెద్ద పులి సంచరిస్తున్నట్టు సమాచారం. నల్లజర్లకు చెందిన వ్యాన్ డ్రైవర్ ప్రసాద్ బుధవారం రాత్రి ఒంటిగంటకు ఏలూరు నుంచి వస్తున్నాడు. పుల్లలపాడు వీరమ్మ చెరువు వద్దకు వచ్చేసరికి బైపాస్ దాటి నిమ్మకాయల మార్కెట్ వైపునకు వెళ్లడంతో భయంతో వ్యాన్ డ్రైవర్ 100కు ఫోన్ చేశాడు. దీంతో అప్రమత్తమైన ఫారెస్ట్ అధికారులు గురువారం ఉదయం ఆ మార్గాన్ని పరిశీలించారు. పెద్ద పులి జాడలను గుర్తించి ఉన్నతాధికారులకు తెలియజేశారు. నిమ్మకాయల మార్కెట్ నుంచి జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు వ్యవసాయ క్షేత్రం వద్ద ఉన్న తడికలకుంట చెరువులో నీరు తాగిన ఆనవాళ్లు ఉన్నాయి. అదే మార్గం గుండా చీపురుగూడెం ఫారెస్ట్‌లో జీడిమామిడి తోటలో సంచరిస్తున్నట్టు గుర్తించిన ఫారెస్ట్ గార్డ్ శ్రీనివాస్ చీపురుగూడెం, నల్లజర్ల, పుల్లలపాడు గ్రామస్తులను అటవీ ప్రాంతం వైపు వెళ్లవద్దని హెచ్చరించారు. అటవీ ప్రాంతంలో పెద్ద పులి సంచరిస్తుందని తెలియడంతో రైతులు, మేకల కాపరులు, సామాన్య ప్రజానీకం భయాందోళన చెందుతున్నారు.

పెద్దపులి జాడలు వాస్తవమే..శ్రీనివాస్, ఫారెస్ట్ గార్డ్

తడికలకుంట నుంచి నేరుగా చీపురుగూడెం ఫారెస్ట్‌లోని జీడిమామిడితోటలో పులి ఉన్నట్టు అంచనా వేస్తున్నాం. పెద్దపులి కనిపించినట్టు ఫోన్ రావడంతో గురువారం ఉదయం వీరమ్మ చెరువు,పుల్లపాడు నిమ్మకాయల మార్కెట్, తడికలకుంట ప్రాంతాల్లో పరిశీలించాం. పెద్ద పులి అడుగుల జాడ స్పష్టంగా ఉంది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలను అటు వైపు వెళ్లవద్దని హెచ్చరించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం బోనులు ఏర్పాటు చేసి పెద్ద పులిని పట్టుకునే ప్రయత్నం చేస్తాం.

దళితులను అణగదొక్కుతున్న వైసీపీ ప్రభుత్వం

అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్



మాట్లాడుతున్న అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్

అంబాజీపేట, జనవరి 25: వైసీపీ ప్రభుత్వం దళితులను అడుగడుగునా అణగతొక్కుతుందని, వైసీపీ వైఫల్యాలు, దళితులకు చేస్తున్న అన్యాయాన్ని సింహగర్జన ద్వారా వివరిస్తామని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. రాజమహేంద్రవరం వేమగిరిలో ఫిబ్రవరి 11వ తేదీన నిర్వహించే దళిత సింహగర్జన ఏర్పాటు సందర్భంగా 500 మోటార్‌సైకిళ్లతో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ రాజమహేంద్రం నుంచి ప్రారంభమై బొబ్బర్లంక, రావులపాలెం మీదుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చేరింది. ఈ సందర్భంగా అంబాజీపేటలో హర్షకుమార్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. దళిత సింహగర్జనలో వైసీపీ వైఫల్యాలు, దళితులకు చేస్తున్న అన్యాయాలను వివరిస్తామన్నారు. సీఎం జగన్ సభలో ఓ దళిత మంత్రి మోకాలపై కూర్చోవడం, మరో మంత్రి అగ్రవర్ణాలు కూర్చుంటే ఆయన నిల్చుంటారన్నారు. ఇంకో దళిత ఎమ్మెల్సీ సామాజిక చైతన్య యాత్రలో సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వాలని కోరుకుంటారని ఎద్దేవా చేశారు. టీడీపీ హయాంలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చేవారని, వైసీపీ ప్రభుత్వం జగన్ విద్యాదీవెన వంటి పథకాలతో పీజీ విద్యార్థులకు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. దీంతో దళిత విద్యార్థులు విద్యలో వెనుకడుగు వేస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో దళితులపై దాడులు పెరిగిపోయాయన్నారు. సీఎం జగన్ దళితులపై కపట ప్రేమ ఉన్నట్లు నటిస్తున్నారని విమర్శించారు. సింహగర్జనను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జీవీ శ్రీరాజ్, నూకపెయ్యి చిన్న, మాత సత్యనారాయణ, బీర సురేష్, కత్తుల విక్టర్ పాల్గొన్నారు.

ఫిబ్రవరి 5 నుంచి జాతీయస్థాయి గిరిజన ఉత్సవం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

దివాన్‌చెరువు, జనవరి 25: జాతీయస్థాయి గిరిజన సాంస్కృతిక ఉత్సవాలు ఫిబ్రవరి 5వ తేదీ నుంచి రెండు రోజుల పాటు జరుగుతాయని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు కె.అక్కులప్పనాయక్ తెలిపారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో వీసీ ఆచార్య కె.పద్మరాజు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అక్కులప్పనాయక్ మాట్లాడుతూ ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ ఆధ్వ ర్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఆదివాసీ గిరిజన కళాకారులచే గిరిజన సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఈ కార్యక్రమాలు జరుగుతాయని అక్కులప్పనాయక్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర, గిరిజన ఎమ్మెల్యేలు. ఎమ్మెల్యే జక్కంపూడిరాజా, జక్కంపూడి విజయలక్ష్మి, నన్నయ వీసీ, రిజిస్ట్రార్ అధ్యాపకులు పాల్గొంటారని చెప్పారు. రాజానగరం, రాజమహేంద్రవరం ప్రజలు ఈ ఉత్సవాలను, గిరిజన సాంస్కృతిక వైవిధ్యాలను వీక్షించి ఆనందించాలని కోరారు. కార్యక్రమంలో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిభాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణునాయక్, రాజ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ దొర, జాన్‌వెస్లీ, చిన్నా, నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధ్యాపకులు విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

అధునాతన కృత్రిమ మేధాశక్తితో మార్పులు తీసుకురావాలి



వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న ప్రతినిధులు

రాజానగరం, జనవరి 25: అధునాతన కృత్రిమ మేధాశక్తితో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి కృషి చేయాలని రాజమహేంద్రవరం సీటీఆర్‌ఐ డైరెక్టర్ మాగంటి శేషు మాధవ్ ఆకాంక్షించారు. షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో గురువారం నిర్వహించిన కిసాన్ మేళా సదస్సుకు కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ (ఐకార్-సీటీఆర్‌ఐ) రాజమహేంద్రవరం డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కేవీకే మహిళా సాధికారత దిశగా ఎన్నో వినూత్న కార్యక్రమాలు, వృత్తి నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను చేపడుతోందన్నారు. ప్రధానంగా షెడ్యూల్డ్ కులాల మహిళలకు కొబ్బరిపీచు, జనపనారతో వివిధ రకాల ఉత్పత్తుల తయారీలో నైపుణ్య శిక్షణను కల్పిస్తూ, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు మాట్లాడుతూ ఉప ప్రణాళిక నిధుల ద్వారా కేవీకే అందజేస్తున్న శిక్షణా కార్యక్రమాలను ఎస్సీ రైతులు, రైతు మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీసీఎన్‌ఎఫ్ డీసీఎం బి.తాతారావు మాట్లాడుతూ యువత సాఫ్ట్‌వేర్ రంగంతో పాటు వ్యవసాయ రంగంపై ఆసక్తి చూపాలన్నారు. కేవీకే హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా పనిముట్లను వివిధ మండలాల్లోని ఎస్సీ రైతులకు, మహిళలకు అందజేస్తున్నామన్నారు..ఈ సందర్భంగా కేవీకేలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను సీటీఆర్‌ఐ డైరెక్టర్ మాగంటి శేషు మాధవ్ ప్రారంభించారు. అనంతరం కిసాన్ మేళా సందర్భంగా ఎస్సీ రైతులకు, మహిళలకు వివిధ రకాల పనిముట్లు అందజేశారు. కేవీకే సిబ్బంది జేవీఆర్ సత్యవాణి, దిలీప్, ఎంఏ రాజు, విజయ వర్ధన్, జె.ప్రభాత్, ఆర్.రత్నాజీ, పంచాయతీ కార్యదర్శి పీవీ రమణకుమారి, రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘాల సభ్యులు (పందూరు), కృషి విజ్ఞాన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎగ్జిబిషన్..

కిసాన్ మేళాలో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ రకాలైన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. అలాగే ప్రకృతి వ్యవసాయంతో (ఏపీసీఎన్‌ఎఫ్) అనుసంధానంగా పండించిన వివిధ రకాల దేశవాళీ వరి రకాలు, పంటల సస్యరక్షణ కషాయాలు, కూరగాయల నారు, వివిధ ఉత్పత్తులు, యూనిట్ల ప్రదర్శన అబ్బుర పరిచింది. అలాగే ట్రాక్టర్ ద్వారా నడపబడే అనేక వ్యవసాయ పనిముట్లను ప్రదర్శించి, వాటి ఉపయోగాలను, రైతులకు, విద్యార్థులకు వివరించారు.

పరీక్షల ఒత్తిడిని తట్టుకోలేకనే మెడికో ఆత్మహత్య



సర్పవరం జంక్షన్, జనవరి 25: వైద్యురాలు కావాలన్న కోరికతో కష్టపడి..ఇష్టంతో ఎంబీబీఎస్ సీటు సాధించిన ఆ విద్యార్థి పరీక్షల ఒత్తిడిని తట్టుకోలేకపోయింది. తనువు చాలించాలని నిర్ణయించుకుంది. చదువు మధ్యలో మానేసి కుటుంబ సభ్యులను నిరాశకు గురి చేయలేక..ఏం చేయాలో పాలుపోని స్థితిలో జీవితంపై విరక్తితో సముద్రంలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కాకినాడ సూర్యనారాయణపురం రంగయ్యనాయుడువీధికి చెందిన వంకధారి శ్వేత (25) ఇంటర్ అనంతరం నీట్‌లో ఓపెన్ కేటగిరీలో 714 ర్యాంకు సాధించి ప్రతిష్టాత్మక కాకినాడ రంగరాయ వైద్య కళాశాల్లో ఎంబీబీఎస్‌లో 2018-19 విద్యా సంవత్సరంలో సీటు సాధించింది. రోజూ ఇంటినుంచే మెడికల్ కాలేజీకి వెళ్లి వస్తుంటుంది. ఎంబీబీఎస్‌లో తొలి రెండేళ్లు పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించింది. మూడో ఏడాదిలో పరీక్షల పట్ల భయం ఏర్పడింది. పరీక్ష రాయాలంటేనే ఒత్తిడికి లోనవ్వడం, పరీక్షా హాలులో కళ్లు తిరిగి పడిపోవడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. శ్వేతకు పరీక్షలపై ఉన్న భయాన్ని పోగొట్టేందుకు తల్లిదండ్రులు ఇంట్లోనే యోగా అభ్యసనాల సాధన, వ్యాయామం, వాకింగ్ వంటివి చేయించేవారు. ఆర్‌ఎంసీ అధ్యాపకులు కూడా పరీక్షలపై ఏర్పడిన భయాన్ని పోగొట్టేందుకు కౌన్సిలింగ్ చేసి భరోసా కల్పించేవారు. అయినా సరే పరీక్షలు వస్తున్నాయంటే ఎక్కడ ఫెయిల్ అవుతాననే మానసిక భావనతో ఉండేది. తరగతులకు క్రమం తప్పకుండా రావడం, వినడం అన్నీ చేసేదని, పరీక్షలు వచ్చాయంటే ఆత్మన్యూనతా భావానికి గురై ఆందోళనకు గురయ్యేదని సహచర వైద్య విద్యార్థులు తెలిపారు. పరీక్షలపై ఉన్న భయంతోనే శ్వేత ఆత్మహత్యకు పాల్పడినట్లు తిమ్మాపురం ఎస్‌ఐ షేక్ షరీఫ్ తెలిపారు. మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు.

12 మంది ఎస్ఐలకు సీఐలుగా పదోన్నతి

ఏలూరు క్రైం, జనవరి 25 : ఏలూరు రేంజ్‌లో పనిచేస్తున్న ఎస్ఐలలో సీనియారిటీని బట్టి 12 మందికి సీఐలుగా పదోన్నతులు కల్పిస్తూ ఏలూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జీవీజీ అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన వారిలో వి.వెంకటేశ్వరరావు (తూర్పుగోదావరి జిల్లా), జి.కాశీచరణ్ (కోస్టల్ సెక్యూరిటీ పోలీస్), గోవాడ వెంకటేశ్వరరావు (డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా), నామాల మురళీకృష్ణ (తూర్పుగోదావరి జిల్లా), సీహెచ్ గోపాలకృష్ణ (కాకినాడ జిల్లా), వాసిరెడ్డి శ్రీను (ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ విజయవాడ), బొర్రా నరసింహమూర్తి (తూర్పుగోదావరి జిల్లా), బీర సత్యనారాయణ (ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ విజయవాడ), లోకవరపు గౌరీనాయుడు (సీఐడీ), జిల్లెళ్ళ జేమ్స్‌రత్నప్రసాద్ (సీఐడీ), ఏలేటి చిట్టిబాబు (ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ విజయవాడ), చలమూరి ప్రకాష్ (ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ విజయవాడ) ఉన్నారు. వీరికి ఒకటి రెండు రోజుల్లో పోస్టింగులు కల్పించనున్నారు.

సందేశాత్మకంగా నాటికలు



ఇంద్రప్రస్థం నాటికలో ఓ సన్నివేశం

పెద్దాపురం, జనవరి 25: ప్రజల జీవితాలను ప్రతిబింబించేదే కళ అని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జ్యోత్స్నుల కృష్ణబాబు అన్నారు. పెద్దాపురం మండలంలోని చంద్రమాంపల్లి గ్రామంలో స్నేహ ఆర్ట్స్ నాటక పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న తెలుగు రాష్ట్రాల రాష్ట్రస్థాయి నాటికల పోటీలు రెండోరోజు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మన పెద్దాపురం ఫేస్ బుక్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్, స్నేహ ఆర్ట్స్ అధ్యక్షుడు గొందేసి రాజా, యిందన బ్రహ్మానందం, దేవాడ పాపేశ్వరరావు పాల్గొన్నారు.

విలువలను తెలియచేసిన ఇంద్రప్రస్థం..

అభినయ ఆర్ట్స్ (గుంటూరు) గోపీ సత్యప్రకాష్ రచనలో రవీంద్రరెడ్డి దర్శకత్వంలో ప్రదర్శించిన ఇంద్రప్రస్థం నాటిక ఎంతగానో ఆకట్టుకుంది. ప్రేమ అనేది సృష్టిలో ఎంతో గొప్పదని కానీ ఆ ప్రేమలు హర్షించేలా కనిపించాలే తప్ప అనాలోచిత నిర్ణయాలతో వెర్రిగా పరుగులు పెట్టకూడదనే సందేశాన్ని ఇచ్చారు.

సమాజాన్ని ప్రశ్నించిన రైతే రాజు నాటిక

దేశం వెలుపల జవాన్, దేశం లోపల కిసాన్.. వీళ్ల లేకపోతే మొత్తం దేశమే లేదు, ప్రపంచాన్ని అరచేతిలో ఉన్న సెల్‌ఫోన్ శాసిస్తున్న ప్రస్తుత తరుణంలో పిడికెడు అన్నం లేకపోతే బతకలేం అనే సందేశంతో సాగిన రైతే రాజు నాటిక ఆకట్టుకుంది. హైదరాబాద్ కళాంజలి సంస్థ ప్రదర్శన ఇవ్వగా కంచర్ల సూర్యప్రకాష్ రచించారు. కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించారు. అలాగే రాఘవ మూవీ మేకర్స్ (గుంటూరు) వారి కెరటాలు నాటిక కూడా ఎంతగానో ఆకట్టుకుంది.

వైఎస్ఆర్ వర్సిటీతో ఒప్పందం

కడియం, జనవరి 25: సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ సంఘంతో వైఎస్ఆర్ విశ్వవిద్యాలయం ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ సందర్భంగా నర్సరీ సంఘం అధ్యక్షుడు మల్లు పోలరాజు, నర్సరీ సంఘం డైరెక్టర్లు గురువారం వైఎస్సార్ ఉద్యానవిశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ టి.జానకీరామ్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సరీ రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందిస్తూ దేశవిదేశాల వాణిజ్యంలో తగిన పోటీ ఇచ్చేలా ఉండాలని, రైతుకు కావాల్సిన అవసరాలను, సాంకేతిక నిపుణుల అభిప్రాయాలను అనుసరించి రైతులకు కొత్త వంగడాల రూపకల్పన చాలా అవసరమని భావించి తాము వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో వైస్ చాన్స్‌లర్ టి.జానకీరామ్‌ను కలిసి ఈ ఒప్పందాన్ని చేసుకున్నట్లు తెలిపారు. నర్సరీసంఘం ఉపాధ్యక్షుడు పెనుమాక కొండబాబు, కార్యదర్శి గాద నాగేశ్వరరావు, కోశాధికారి తాడాల బాలమురళీకృష్ణ, సహాయ కోశాధికారి జంగా సుబ్బారావు, పీఆర్‌వో గరగ నాగేశ్వరరావు, డైరెక్టర్లు తాడాల నాగేశ్వరరావు, కొండేపూడి నాగు, వడ్లమూరి రాజేష్ పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి మహిళ మృతి

తుని రూరల్, జనవరి25: గొల్లప్రోలు, రావికంపాడు రైల్వేస్టేషన్ల మధ్యలో రావికంపాడు వద్ద గుర్తు తెలియని రైలు నుంచి మహిళ జారిపడి మృతి చెందింది. స్థానికులు రైల్వే స్టేషన్‌లో సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని తుని రైల్వే పోలీసులు పరిశీలించారు. మహిళ జార్ఖండ్‌కు చెందిన సరోట దేవిగా గుర్తించి మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఉత్సవాలకు రథం సిద్ధం



అంతర్వేది, జనవరి 25: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు మాఘ మాసం ఫిబ్రవరి 16 నుంచి ప్రారంభమవుతాయని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. కల్యాణోత్సవాల్లో భాగంగా నిర్వహించే రథోత్సవానికి రథాన్ని సిద్ధం చేస్తున్నామని చెప్పారు. గురువారం షెడ్డులో నుంచి రథాన్ని బయటకు తీసుకువచ్చి ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉంచారు. రంగులు వేసి ఆర్‌అండ్‌బీ అధికారులు ఇచ్చిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌తో రథసప్తమి నాటికి రథాన్ని సిద్ధం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు, వాహనకారులు, అగ్నికుల క్షత్రియులు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ సమాచారం

'రంప'లో టీడీపీ స్థితిగతులపై ద్విసభ్య కమిటీ పర్యవేక్షణ



నేతలతో సమావేశమైన ద్విసభ్య కమిటీ సభ్యులు

రంపచోడవరం, జనవరి 25:రంపచోడవరం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పరిస్థితులను తెలుసుకునేందుకు పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశంతో ఇద్దరు సభ్యుల ప్రత్యేక కమిటీ గురువారం నియోజకవర్గంలో పర్యటించింది. ఈ కమిటీలో సభ్యులుగా మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, చోడవరం మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు ఉన్నారు. వారు మూడు చోట్ల సమావేశాలను నిర్వహించి ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు, 11 మండలాల ముఖ్య నేతలతో భేటీ అయి పార్టీ పరిస్థితులపై సమగ్రంగా ఆరా తీశారు. గత ఏడాది నియోజకవర్గానికి సంబంధించి చంద్రబాబు అమరావతిలో నిర్వహించిన సమావేశంలో వచ్చిన అనేక ఫిర్యాదుల నేపథ్యంలో పార్టీ పరిస్థితిపై ఆయన దృష్టి సారించారు. ఇక్కడ పార్టీ పరిస్థితి, పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఇక్కడ పార్టీ పరిస్థితిపై వాస్తవాలను పూర్తిగా గ్రహించే విధంగా పరిశీలన జరిగాలని నిర్ణయించిన చంద్రబాబు ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూరమేష్, వంతల రాజేశ్వరిలనే కాకుండా 11 మండలాలలోని ముఖ్య నేతలతో కూడా ముఖాముఖిగా మాట్లాడి నివేదిక సమర్పించాలన్న ఆదేశంతో ఒకరితో ఒకరికి సంబంధం లేకుండా ఈ ప్రత్యేక పరిశీలకులు ఆయా నాయకుల అభిప్రాయాలను తీసుకున్నారు. రాజఒమ్మంగి, రంపచోడవరం, చింతూరు కేంద్రాలుగా నిర్వహించిన భేటీలో ఈ అభిప్రాయ సేకరణ చేశారు.

ఓటు అవగాహనా ర్యాలీ

రంపచోడవరం, జనవరి 25: ఓటరు గుర్తింపు కార్డు కలిగిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్ చెప్పారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆయన వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీలో ఈవీఎంలపై అవగాహన కలిగించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సీనియర్ సిటిజన్లు, నూతనంగా ఓటరు గుర్తింపు పొందిన దివ్యాంగులను సన్మానించారు. కార్యక్రమంలో మొబైల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు జాన్‌రాజ్, సీఐ వి.వెంకటేశ్వరరావు, తహశీల్దారు పీవీజే కుమార్, డీటీలు ఎన్‌వీవీ సత్యనారాయణ, బి.రాజు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్లు డి.ఇందిరాబాయి, టి.లక్ష్మణరావు, ఎస్ఐ ఎంఆర్‌కే రాజు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

ఎటపాక, జనవరి 25: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం ఎటపాక వైటీసీ భవనంలో ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పృథ్వీ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుకు ఎంతో ప్రాముఖ్యం ఉందని, ఓటుతో సమాజంలో సమర్థవంతమైన నాయకులను ఎన్నుకోవచ్చని చెప్పారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు పొందడానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జాతీయ ఓటర్ల దినోత్సవం

మోతుగూడెం,జనవరి 25: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న ఫోర్ బై గ్రామంలో 9వ వార్డులో గురువారం వీఆర్వో వెంకటేశ్వరరావు ఓటర్ ఐడీ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన ఓటు హక్కు వినియోగం గురించి వివరించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానోపాధ్యాయుడు పోతురాజు, వలంటీర్ నీలవేణి, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

వెంకన్న ఆదాయం రూ.5.40 లక్షలు

రంపచోడవరం, జనవరి 25: మండలంలోని ఐ.పోలవరం గోవిందగిరి వెంకటేశ్వరుని హుండీ ఆదాయాన్ని గురువారం ఆలయ అధికారులు శ్రీనివాస్, వెంకటయ్య, మల్లికార్జున ఆధ్వర్యంలో లెక్కించినట్లు ధర్మ ప్రచార సేవా భక్తమండలి కో-ఆర్డినేటర్ నల్లమిల్లి వెంకట రామారెడ్డి తెలిపారు. ఆలయానికి మూడు నెలలకు గాను రూ.5.40 లక్షలు ఆదాయం చేకూరినట్లు తెలిపారు. నారాయణరాజు, శివరామ్, పవన్‌కుమార్, ఎంసీడబ్ల్యూ, శ్రీనివాస్, వెంకటరమణ, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ నుంచి సొమ్ము రికవరీ

రాజవొమ్మంగి జనవరి 25: లబ్బర్తి గ్రామంలో ఏడాది క్రితం చనిపోయిన శెలంశెట్టి సూర్యకాంతం పేరిట సుమారు ఏడాదిగా పింఛన్ సొమ్మును తీసుకుంటున్న వలంటరీ నుంచి రికవరీ చేశారు. ఆంధ్రజ్యోతిలో మంగళవారం గ్రామ వలంటీర్ చేతివాటం అంటూ కథనం రావడంతో లబ్బర్తి గ్రామానికి ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి వెళ్లి ఘటనపై పూర్తి దర్యాప్తు చేశారు. దీనిలో భాగంగా గురువారం సంబంధిత వలంటీర్ రమణబాబు వద్ద రూ.27500 రికవరీ చేసి బ్యాంక్‌లో చలానా కట్టినట్లు లబ్బర్తి సెక్రటరీ వంశీ తెలిపారు. ఎంపీడీవో విజయరంగారావు మాట్లాడుతూ దర్యాప్తు నివేదికను ఉన్నతాధికారులకు పంపి వారి సూచనల మేరకు వలంటీర్‌పై చర్యలు చేపడతామన్నారు.

టీడీపీ గెలుపే లక్ష్యం కావాలి

కూనవరం, జనవరి 25: ప్రతీ ఒక్క కార్యకర్త టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని తెలుగుదేశం పార్టీ మండల నాయకులు పొడియం అప్పారావు అన్నారు. రాబోవు ఎన్నికలలో టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థికి కూనవరం మండలంలో భారీ ఆధిక్యత వచ్చేలా కృషి చేయాన్నారు. బూత్‌స్థాయి కమిటీల నుంచి మండల స్థాయి కమిటీల వరకు ఎక్కడా నిర్లక్ష్యం వహించకూడదన్నారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుతూ ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా వంతల రాజేశ్వరి పేరు ప్రకటించాలంటూ టీడీపీ కూనవరం మండల కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బరపాటి ప్రకాష్‌రావు, యడవల్లి భాస్కర్, నోముల సత్యనారాయణ, గడేసుల ప్రేమ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

అడ్డతీగల, జనవరి 25: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం స్థానిక ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, ఎమ్మెల్యే ధనలక్ష్మి నాలుగో విడత ఆసరా చెక్కును గురువారం పంపిణీ చేశారు. . ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జడ్డంగిలో చెక్కుల పంపిణీ

రాజవొమ్మంగి, జనవరి 25: మండలంలోని జడ్డంగి గ్రామంలో గురువారం ఆసరా నాలుగో విడత చెక్కులను ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పంపిణీ చేశారు.

వృద్ధులకు, దివ్యాంగులకు రగ్గుల అందజేత

దేవీపట్నం, జనవరి 25: రిపబ్లిక్‌డే సందర్భంగా ఆంధ్ర కళ్యాణ ఆశ్రమం వారి ఆధ్వర్యంలో భరతమాత పూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 250 మంది వృద్ధులకు, దివ్యాంగులకు రగ్గుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగాలాండ్ నుంచి అకిల భరతమాత వనవాసి ఆశ్రమ ప్రముఖ్ శ్రీకృష్ణబిందే విచ్చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు

మోతుగూడెం, జనవరి 25: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు సబ్‌స్టేషన్‌లో రూ.30 లక్షలు విలువైన 1.5 ఎంవీఏ సామర్థ్యం గల నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, డీఈటీ వరప్రసాద్ మాట్లాడుతూ నాలుగు, ఐదు యూనిట్ల నిర్మాణ పనులకు పొల్లూరు, మోతుగూడెం గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులకు సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ ఏడీలు, ఏఈలు, డిస్ట్రిబ్యూషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్యదర్శి సస్పెన్షన్

కడియం, జనవరి 25: విధి నిర్వహణలో సక్రమంగా వ్యవహరించ లేదని కడియం మండలం దుళ్ల ఇన్‌చార్జి కార్యదర్శి డి.విజయరాజును సస్పెండ్ చేస్తూ జిల్లా గ్రామ పంచాయతీ అధికారి జె.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. కడియపులంక కార్యదర్శిగా చేసిన సమయంలో విధులకు సక్రమగా హాజరుకావడంలేదని, రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదని తదితర విషయాలపై వచ్చిన ఫిర్యాదు మేరకు అక్కడ బాధ్యతలు తొలగించి డిప్యూటేషన్‌పై దుళ్ళ కార్యదర్శిగా నియమించారు. ఇటీవల కడియపులంకలో చేపట్టిన విచారణపై సహకరించలేదని, రికార్డులు చూపలేదని తదితర అంశాలపై కార్యదర్శి డి. విజయరాజును సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో కె రత్నకుమారి తెలిపారు.

అర్హులందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

● జాతీయ ఓటర్ల దినోత్సవంలో ఆర్డీవో చైత్రవర్షిణి



మండలస్థాయి పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆర్డీవో చైత్రవర్షిణి

రాజానగరం, జనవరి 25: 18 సంవత్సరాలు పైబడి ఇంకా మిగిలిన ఉన్న యువతీ, యువకులంతా విధిగా ఓటు హక్కు నమోదు చేసుకోవా లని రాజమహేంద్రవరం ఆర్డీవో చైత్రవర్షిణి పిలుపునిచ్చారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓటు హక్కు నమోదు, వినియోగంపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులంతా ప్లకార్డుల ప్రదర్శనతో స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా గాంధీబొమ్మ సెంటర్‌కు చేరుకుని, మానవహారం చేపట్టి, ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంవద్ద ప్రత్యేక సమావేశంలో ఆర్డీవో చైత్ర వర్షిణి మాట్లాడుతూ అర్హులైన వారంతా ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంవద్ద ఏర్పాటుచేసిన బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్ నమూనా సెంటర్‌పై విద్యార్థులకు అవ గాహన కల్పించడంతోపాటుగా మాక్‌పోల్ నిర్వహించారు. అనంతరం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని యువ ఓటర్లు, సీనియర్ సిటిజన్లు, విభిన్న ప్రతిభావంతుల్ని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. పాఠశాల విద్యార్థులకు మండలస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు ఆర్డీవో చైత్రవర్షిని సర్టిఫికెట్లు అందజేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ పవన్‌కుమార్, ఎంఈవో జ్యోతి ప్రసాద్, సీఐ పి.కాశీవిశ్వనాథ్, ఐఎస్‌టీఎస్ ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ కళ్లెం ఉపేందర్‌రెడ్డి, వీఆర్వోలు, గాయత్రి జూనియర్ కళాశాల, ఐఎస్‌టీఎస్ ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

గోకవరం: ప్రతీఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని స్థానిక గ్రంథాలయ అధికారిణి కె.ప్రియదర్శిని అన్నారు. గోకవరంలోని శాఖా గ్రంథాలయంలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఓటు ఆవశ్యకతను పాఠకులకు వివరించారు. రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం జరిగింది. ఓటుహక్కును వినియోగించుకోవాలంటూ విద్యార్థులతో అధికారులు ప్రధానరహదారిపై భారీ ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో తహశీల్దారు శ్రీనువాస్, మాజీ ఎంపీటీసీ ఫులపర్తి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

దివాన్‌చెరువు: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా భూపాలపట్నంలోని రైట్ ఇంజనీరింగ్ కళాశాలలో నూతన ఓటర్ల సమ్మేళనంను గురువారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబురెడ్డి, బీజేపీ రాజమండ్రి రూరల్ అసెంబ్లీ కన్వీనర్ ఆకుల శ్రీధర్, బీజేపీ నాయకులు కందుకూరి మనోజ్‌బాబు, షేక్‌సాజిద్, నాగభూషణం పాల్గొన్నారు.

సీతానగరం: రాష్ట్ర ప్రగతిని దృష్టిలో ఉంచుకుని సరైన నేతను ఎంపిక చేసుకుని ఓటు హక్కు వినియోగించుకోవాలని సీతానగరం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.చిట్టిబాబు సూచించారు. గురువారం వెదుళ్ళపల్లి హైస్కూల్‌లో జరిగిన 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.సుధామయి, సిబ్బంది సుబ్బారావు, మీనాక్షి, ప్రసాద్ పాల్గొన్నారు.

బిక్కవోలు: ఇళ్లపల్లి ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్చి హెచ్ఎం పప్పు శ్రీనివాసరెడ్డి విద్యార్థులకు వివరించారు. నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా విద్యార్థులు ఎన్‌వీడీ ఆకారంలో కూర్చుని అందరీ ఆకట్టుకున్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తాడి రామచంద్రారెడ్డి, సీహెచ్. వీరభద్రరావు, తమలంపూడి ఈశ్వరరెడ్డి, కార్యదర్శి ఎన్. వంశీరాఘవ తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును బాధ్యతగా వినియో గించుకుని మంచి నాయకుడిని ఎన్నుకోవాలని అనపర్తి నియో జకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎబివిఎస్‌బి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని అనపర్తిలోని తేతలి రామిరెడ్డి మంగయ్యమ్మ కళావేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసం గించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప లువు రు సీనియర్ సిటిజన్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అనపర్తి ఏఈఆర్వో, తహసీల్దార్ వై సరస్వతి, డిప్యుటి తహసీల్దార్ శశిదర్, ఆర్ఐలు, విఆర్వోలు పాల్గొన్నారు.

'29న చంద్రబాబు సభను జయప్రదం చేయాలి'

కోరుకొండ, జనవరి 25: ఈ నెల 29వ తేదీ రాజమహేంద్రవరం రూరల్ కాతేరులో నిర్వహించనున్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు బహిరంగసభను జయప్రదం చేయాలంటూ మాజీమంత్రులు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, కేఎస్ జవహర్, గోరంట్ల బుచ్చియ్యచౌదరిలు పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం సాయంత్రం కోరుకొండ శివారు బూరుగుపూడి గేటు టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, 7 నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌లు, ముఖ్యనేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజానగరం ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో ఈ సమీక్షా సమావేశం జరిగింది. రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, అనపర్తి, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాలకు చెందిన టీడీపీ ఇన్‌చార్జ్‌లతో సమీక్ష నిర్వహించారు. సభ విజయవంతం కావడానికి మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, ఇన్‌చార్జ్‌ల సలహాలు, సూచనలు అడిగి తెలుసుకున్నారు. రాజమహేంద్రవరం చంద్రబాబు బహిరంగ సభ విజయవంతం కావడానికికావాల్సిన ఏర్పాట్లు చర్చించారు. జన సమీకరణ, 7నియోజకవర్గాల జనసేన ఇన్‌చార్జ్‌ల ఆహ్వానం, సభ నిర్వహణ, తదితర అంశాలపై చర్చించారు. టీడీపీ ఇన్‌చార్జ్‌లకు మాజీ మంత్రులు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో బొడ్డు వెంకటరమణ చౌదరి, వనమాడి కొండబాబు, బండారు సత్యానందరావు, చిల్ల జగదీశ్వరి, జ్యోతుల నవీన్, స్థానిక నాయకులు తనకాల నాగేశ్వరరావు, గంగిశెట్టి సత్తిబాబు, వలవల రాజా, పలువురు మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

ఇచ్చేది గోరంత... దోచేది కొండంత

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

అనపర్తి, జనవరి 25 : రాష్ట్రంలో పేదలకు అందించే సంక్షేమం గోరంత ఉంటే దోచుకునేది మాత్రం కొండంత ఉందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువా రం అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసరా కార్యక్రమం పేరుతో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి మాటలు వింటుంటే ఆశ్చర్యం కలుగు తుందని టీడీపీ హయాంలో కోటి పద్నాలుగు లక్షల మంది మహిళలకు రూ.20వేల చొప్పున లబ్ధిచేకూరిస్తే నేడు జగన్‌రెడ్డి ప్రభుత్వం వారి సంఖ్యను 79 లక్షలకు తగ్గించడమే కాకుండా లబ్ధి రూ.15వేలకు కుదించిందన్నారు. మద్యం రేట్లు పెంచడమే మద్యపాన నిషేధం అంటూ ప్రజలను మోసం చేశారని జగన్ రెడ్డి బ్రాండ్ల ద్వారా అనేకమంది ఆరోగ్యాలు పాడుచేసుకుని మృతి చెందారని అన్నారు.

షర్మిలకు రాజానగరంలో ఘన స్వాగతం

రాజానగరం, జనవరి 25 : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళకు రాజాగరంలో ఆపార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. గురువారం కాకినాడ పర్యటన ముగింపుకుని రాజమహేంద్రవరం వైపుగా వెళ్తున్న షర్మిళ మార్గమధ్యలో రాజానగరం వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి షర్మిళ పూలమాలలు వేసి ఘన నివాళుర్పించారు. జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడికి తీవ్రగాయాలు

అనపర్తి, జనవరి 25 : అనపర్తి మండలం లక్ష్మీనరసాపురం వద్ద కెనాల్ రోడ్డుపై గురువారంరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని సైకిల్‌పై వెళుతున్న వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అనపర్తికి చెందిన నమశ్శివాయ అనే వృద్ధుడు లక్ష్మీనరసాపురంలోని ఫ్యాక్టరీలో నైట్ వాచ్ మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి సైకిల్‌పై డ్యూటీకి వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన కారు బలంగా ఢీకొట్టింది. దీంతో తల, ముక్కు, చాతీ భాగాలలో తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ వ్యక్తిని వదిలిపెట్టి కారు ఆపకుండా వెళ్లిపోయింది. గమనించిన స్థానికులు 108 సహాయంతో క్షతగాత్రు డిని అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యంకోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రేపు విద్యుత్‌కు అంతరాయం

రంగంపేట, జనవరి, 25 : రంగంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ నందు వార్షిక మరమ్మతుల కారణంగా రంగంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో రంగంపేట,పెదరాయవరం, చంద్రేడు, కోటపాడు, రామేశ్వంపేట, వెంకటాపురం, సుభద్రంపేట, దొడ్డిగుంటకు విద్యుత్ బోరులకు 27వ తేది శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

దున్నేవాడికే భూమి కోసం ఉద్యమించాలి

రాజానగరం, జనవరి 25 :దున్నేవాడికే భూమికోసం పాలకులపై ఉద్యమించాలని ఏఐకెఎంఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఆల్ ఇండియా జాతీయ నాయకులు టాన్యా పిలుపునిచ్చారు. ఏఐకెఎంఎస్ ఉమ్మడి తూర్పు గోదావరిజిల్లా 10వ మహా సభలు రాజానగరంలోని శ్రీరాజా కాండ్రేగుల జోగి జగన్నాధరావు పంతులు బహద్దూర్ అన్నదాన సంత్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏఐకెఎంఎస్ ఎర్ర జెండాను ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా అధ్యక్షులు వి.చిట్టిబాబు ఆవిష్కరించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం పోరాటా కొలిమి నుంచి ఆవిర్భవించిందన్నారు.ఏఐకెఎంఎస్ దున్నేవాడికే భూమి నినాదంతో 50 ఏళ్ల నుంచి పోరాటం చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నామమాత్రంగా ఉన్న భూసంస్కరణలను సైతం భూస్థాపితం చేసిందని, భూమిలేని వారికి భూమిని పంచే భూసంస్కరణల ఎజెండా బుట్టదాఖలు చేసారన్నారు. అటవీ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, దేవదాయ, ధర్మాదయ భూములను పేదటకు పంచాలని, రైతు ఆత్మహత్యలను అరికట్టాలని డిమాండ్ చేశారు.

జనసేన నేత దుర్గేష్‌కు నాగబాబు పరామర్శ



రాజమహేంద్రవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : సతీవియోగంతో బాధప డుతున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్‌ను జనసేన నాయకుడు, ప్రముఖ సినీనటుడు కొణిదెల నాగబాబు గురువారం పరామర్శించారు.దుర్గేష్ సతీమణి కందుల ఉషారాణి అనారోగ్యా నికి కారణాలు, కుటుంబ సభ్యుల గురించి ఆయన ఆరా తీశారు. దుర్గేష్‌కు ఆయన ధైర్యం చెప్పారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం నిమ్మకాయల చినరాజప్ప మాజీ ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, తోట త్రిమూర్తులు ,నగర ప్రముఖులు ఆయనను పరామర్శించారు.

ముగిసిన జాతీయ సేవా పథకం

రంగంపేట, జనవరి, 25 : ఆధునిక వ్యవసాయ శాస్త్ర విజ్ఞానాన్ని వినియోగించుకొని అధిక దిగుబడులు సాధించడానికి రైతులు చైతన్యవంతులుకావాలని గ్రామ సర్పంచ్ కొల్లాటి శ్యామలావతి అన్నారు. గురువారం రంగంపేట మండలం వడిశలేరు గ్రామంలో కాకతీయ కమ్మ కళ్యాణ మండపంలో జాతీయ సేవా పథకం ఆఖరిరోజున బాపట్ల ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ రావెస్ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించే వంగడాలను సేద్యం చేయాలన్నారు. రైతులకు వ్యవసాయ సేద్యంపై తీసుకోవలసిన మెలకువలు,జాగ్రత్తలు,సేంద్రీయ ఎరువుల వినియోగంపై అవగహన కల్పించి విద్యార్థుల కృషి అభినందనీయమని వ్యవసాయ శాఖ ఏడీఆర్ భరతలక్ష్మీ ప్రశంసించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, డాట్ సమన్వయకర్త నందకిషోర్, శాస్త్రవేత్తలు మనిరత్నం, రామభద్రరాజు, అచ్యుత రాజకుమార్, ఆచార్య డాక్టర్ సి.సంధ్యారాణి, డాక్టర్ సువర్ణలత, రైతులు నలమాటి బుల్లిరాజు,భీముడు,సత్తి సత్తిబాబు, తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జడ్పీమాజీ వైస్‌చైర్మన్ పెండ్యాల నళినీకాంత్(చిన్నారి) జిల్లా వ్యవసాయ కమిటీ సభ్యులు ఎం.రామకృష్ణ, మండలంలో గల వివిధ గ్రామాల రైతులు, వ్యవసాయక్షేత్ర సహాయకులు, రావెస్ వ్యవసాయ విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన గ్రామీణ వ్యవసాయ క్షేత్ర ప్రదర్శనలు, కూరగాయలు పండ్లు, పూల ఆకృతులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని నిరసన

గోకవరం, జనవరి 25: అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యల ను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని రిటైర్డ్ పెన్షనర్లు గురువారం స్థానిక రెవెన్యూ, ఎంపీడీవో కార్యాలయాల ముందు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఎంప్లాయిస్ రిటైర్డ్ పెన్షనర్ల అసోసి యేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో పలు నినాదాలు హోరెత్తాయి. అనంతరం పలు డిమాండ్లతో వినతి పత్రాన్ని పెన్షనర్లు తహశీల్దారు, ఎంపీడీవోలకు అందజేశారు. పెన్షనర్ల ఆందోళనకు యుటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు ఎస్.కుమార్, కార్యదర్శి డి.గంగాధర్ తమ సంఘీభావాన్ని తెలిపారు. పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు జీహెచ్ ఎం రామ కృష్ణారావు, కార్యదర్శి పిల్లంగోరు పాపారావు, గౌరవ అధ్యక్షుడు జె.గవ్వరరాజు, ఉపాధ్యక్షుడు ఎం.చిన్నికృష్ణ, కోశాధికారి ఆర్‌సీ.వర్మ పాల్గొన్నారు.

అనపర్తి: ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అనపర్తి శాఖ ఆధ్వర్యంలో గురువారం అనపర్తి తహసీల్దార్ కార్యాలయంవద్ద పెన్షనర్లు నిరశన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను తహసీల్దార్ సరస్వతి, సబ్ ట్రెజరీ అధికారిణి ఉషారాణిలకు వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పీవీఎస్ సూర్యనారాయణ, ప్రతినిధులు గొలుగూరి రామారెడ్డి, ఎంవీ సుబ్రహ్మణ్యం, ఎమ్‌వీ కృష్ణారెడ్డి, పి.కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

అనపర్తి, జనవరి 25 : నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా అనపర్తిలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఏరియా ఆసుపత్రిగా మార్పు చేశామని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం ఏరియా ఆసుపత్రిలో రూ.13.85 కోట్ల నిధులతో నిర్మించే నూతన భవననిర్మాణ పనులకు ఆయన భూమిపూజచేసి పనులను ప్రారంభించారు. సుమారు 25మంది వైద్యులు, వందమంది సిబ్బందితో సేవలు అందిస్తున్నామన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి, జిల్లా వైద్య సేవల అధికారిణి డాక్టర్ సనత్‌కుమారి, సర్పంచ్ వారా కుమారి, సత్తి రామకృష్ణారెడ్డి, మురళీమోహనబాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం



రహదారి భద్రతలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాజానగరం, జనవరి 25: లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరంగా పరిగణిస్తామని జిల్లా రవాణా అధికారి కేవి కృష్ణారావు అన్నారు. 35వ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని రాజానగరంలోని డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌వద్ద గురువారం లైసెన్స్ పరీక్షల దరఖాస్తుదారులు, వాహనాల ఫిట్‌నెస్ కోసం వచ్చిన యజమానులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. రహదారి భద్రతలపై వాహన దారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలో సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.చైతన్య సుమా, హోమ్‌గార్డ్స్, వాహన యజమానులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రయాణాల్లో సంయమనం పాటించాలి

అనపర్తి, జనవరి 25 : రోడ్డు ప్రయాణాల్లో సంయమనం పాటించాలని లేకుంటే అనేక ప్రమాదాల భారిన పడి ఇబ్బందులు ఎదుర్కోనాల్సి వస్తుందని అనపర్తి ఎస్ఐ రామారావు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా గురువారం అనపర్తిలోని మెయిన్‌రోడ్డులో ఎమ్ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్దులతో కలిసి పోలీసులు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనపర్తి సిఐ శివగణేష్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ర్యాలీలో ఎమ్ఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ తాడి సతీష్‌రెడ్డి పోలీసు సిబ్బంది పి శ్రీనివాస్, తమ్మారావు, సురేష్, రాంబాబు, విద్యార్దులు పాల్గొన్నారు.

ఆర్థికంగా వెనుకబడితే ఉపాధి శిక్షణ : డీఎల్ఎస్ఏ

రాజమహేంద్రవరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనుకబడిన వారి స్వయం ఉపాధికి వివిధ నైపుణ్యాల్లో శిక్షణ అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి పేర్కొన్నారు. గ్రేస్ చారిటబుల్ ట్రస్ట్,హరిత దళం ఎన్జీవో సహకారంతో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. అసంఘటితరంగ కార్మికులకు డీఎల్ఎస్ఏ అందిస్తున్న ఉచిత న్యాయ సేవలపై వివ రించారు.

ఎస్ఐలపై దాడి అమానుషం : ఎంపీ భరత్

రాజమహేంద్రవరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై దాడి అమానుషమని.. దాడి చేసిన వాళ్లను వదిలేది లేదని ఎంపీ భరత్‌రామ్ స్పష్టం చేశారు. ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రజనీదేవిని ఎంపీ గురువారం పరామర్శించారు.ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులు ఆయనకు వివరించారు. నిందితుడిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సెంట్రల్‌జోన్ డీఎస్పీ విజయ్‌పాల్ తెలిపారు.ఎంపీ మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజల బాధ్యత కూడా ఉందని, వారు సహకరించాలేగానీ ఇలా ఉద్యోగులపై దాడికి దిగడం హేయమన్నారు.రజనీదేవి వైద్యానికి నగరపాలక సంస్థ సహాయం చేస్తుందని చెప్పారు. నాలుగు రోజుల కిందట వెంకన్న అనే వ్యక్తి డివైడ ర్‌లో భవన వ్యర్థాలు వేస్తుండగా వారించినందుకు రజనీదేవి, ధరరాజు అనే శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై గమేళాతో దాడి చేసిన విషయం విదితమే. పలువురు ఉద్యోగ, దళిత సంఘాల నాయకులు పరామర్శించారు.

క్రీడా నైపుణ్యం పెంచుకోవాలి : కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 25: రాజమహేంద్రవరంలో క్రీడా నైపుణ్యాన్ని పెంచుతామని కమిషనర్ దినేష్‌కుమార్ అన్నారు. దానవాయిపేట నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల గ్రౌండ్స్‌లో బెంగుళూరు చెందిన లైవ్ యునైటెడ్ వే సంస్థ ఆధ్వర్యంలో క్రీడా సదుపాయాల నిర్మాణ పనులకు కమిషనర్ దినేష్ కుమార్ గురువారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. కొటక్ మహేంద్రా సౌజన్యంతో యునైటెడ్ వే సంస్థ రెండు నెలల్లో ఈ పనులు పూర్తిచేస్తుందన్నారు. కొటక్ మహేంద్ర బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెడిసెంట్ కె సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యత పెంపొందించేందుకు స్పోర్ట్స్ అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీఎం.సత్యవేణి,హెచ్ఎం ఎన్.రాజాప్రశాంత్, లైవ్ యునైటెడ్ వే సంస్థ అసిస్టెంట్ మేనేజర్ భాగ్య కుమార్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ వినోద్‌కుమార్, ఎస్ఈ జి.పాండురంగరావు, డీఈఈ ప్రకాశరావు పాల్గొన్నారు.

అయోర్టా విచ్ఛిన్నమైన వ్యక్తికి అత్యాధునిక సర్జరీతో సరికొత్త జీవితం

యశోధా వాస్కులర్ సర్జన్ డాక్టర్ హేమంత్ కుమార్ చౌదరి



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 25: మానవ శరీరంలో గుండె నుంచి అవయవాలన్నింటికి రక్తాన్ని చేర్చే బృహద్దమని (అయోర్టా) విచ్ఛిన్నమైన వ్యక్తికి అత్యాధునిక సర్జరీతో సరికొత్త జీవితాన్ని ఇచ్చామని యశోధా హాస్పిటల్ వాస్కులర్ సర్జన్ డాక్టర్ హేమంత్ కుమార్ చౌదరి అన్నారు. రాజమహేంద్రవరం బైపాస్ రోడ్డులోని యశోదాలో గురువారం విలేకరులతో మాట్లాడారు. శరీరంలో శక్తివంతమైన బృహద్దమని పని ఒత్తిడిని తట్టుకుని తల పై భాగం మొదలుకొని అరికాళ్ళ వరకు ప్రతి భాగానికి రక్తం చేరేలా చేస్తుందని చెప్పారు. రాజమహేంద్రవరం రూరల్ రాజవోలు గ్రామానికి చెందిన పాపా జక్కులకు ఈ సమస్య రావడంతో చాలా ఇబ్బంది పడ్డారన్నారు. సికింద్రాబాద్‌లో ఉన్న మా హాస్పిటల్‌లో ఈ క్లిష్టమైన సర్జరీని డాక్టర్ ప్రభాకర్ , డాక్టర్ భవిన్ ఎల్ రామ్, డాక్టర్ బస్వరాజ్ తనతో కూడిన బృందం 14 గంటల పాటు చేసి విజయవంతం చేశామని చెప్పారు.సర్జరీ తర్వాత రోగి చాలా ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు.

'ఎంపీ సీటు బీసీలకే ఇవ్వాలి'

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 25: రాజమహేంద్రవరం ఎంపీ సీటు బీసీలకు ఇచ్చే పార్టీకే తమ మద్దతు పూర్తిగా ఉంటుందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సానబోయిన రామా రావు అన్నారు. ఒక ప్రైవేటు హోటల్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. టీడీపీ, వైసీపీలు ఎంపీ సీటును బీసీలకే ఇవ్వాలని లేకపోతే బీసీ సంఘం పక్షాన ఒక బీసీని నిలబెడతామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లన మెగా డీఎస్సీ తీయలేదని,పోలీస్ రిక్రూమెంట్ జరగలేదన్నారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి కెవివి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఉప్పిడి గంగాధర్, ప్రధాన కార్యదర్శి తాతబ్బాయి యాదవ్ పాల్గొన్నారు.

బొమ్మూరు సీఐగా ఉమర్



రాజమహేంద్రవరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): బొమ్మూరు సీఐగా ఎండీ ఉమర్ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. వీఆర్ నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఎస్పీ జగదీశ్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఉమర్ గతంలో ఉమ్మడి తూర్పు గోదావరిలో కాకినాడ, అమలాపురం ప్రాంతాల్లో పనిచేశారు. విజయవాడలో బ్లేడ్‌బ్యాచ్‌ల పనిపట్టిన అనుభవం ఉంది. ఉమర్ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవన్నారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన సీఐ విజయ్‌కుమార్ విజయవాడ ప్రధాన కార్యాలయంలో బుధవారం రిపోర్టు చేశారు. ఆయనకు పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది.

అల్జీమర్స్ వృద్ధుడు బంధువులకు అప్పగింత

రాజమహేంద్రవరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మతి స్థిమితం లేని వ్యక్తిని గంటల వ్యవధిలోనే గుర్తించి బంధువుల చెంతకు రాజమహేంద్రవరం ప్రభుత్వ రైల్వే పోలీసులు(జీఆర్పీ) చేర్చారు. ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో కోల్‌కతాకు చెందిన 75ఏళ్ల వృద్ధుడు స్వరూప్ దుత్త తన భార్యతో కలిసి ప్రయాణిస్తూ రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో గురువారం ఉదయం దిగిపోయాడు.స్వరూప్‌కి అల్జీమర్స్(మతిమరుపు) వ్యాధి ఉంది. రైలు బయలు దేరిన కాసేపటికి గమనించిన భార్య వెంటనే రైల్ మదద్ ద్వారా ఫిర్యాదు చేయగా జీఆర్పీ పోలీసులు వారి వాట్సాప్ గ్రూపుల్లో స్వరూప్ ఫొటోని పోస్ట్ చేశారు. ప్రభుత్వాస్పత్రి వద్ద డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ ధనప్రకాశ్‌కి మధ్యాహ్నం 2గంటల సమయంలో స్వరూప్ తారసపడగా అతడిని జీఆర్పీ స్టేషనుకు తీసుకెళ్లారు.భార్య సూచన మేరకు బంధువులకు స్వరూప్‌ని క్షేమంగా అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ విజయ్‌శంకర్,సిబ్బందిని డీఎస్పీ నాగేశ్వరరావు అభినందించారు.





ఉండవల్లితో షర్మిల

మీకు అండగా మేమున్నాం.. మాకు అండగా మీరున్నారు.. మీకు కష్టం వచ్చిందంటే మేం తట్టుకోలేం.. మాకు కష్టం వచ్చిందంటే మీరు తట్టుకోలేరు.. అందుకే చంద్రబాబును అక్రమంగా స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టు చేసి జైలులో పెడితే తట్టుకోలేక వందలాది మంది తుదిశ్వాస విడిచారని ఎన్టీఆర్ ట్రస్టు చైర్‌పర్సన్, చంద్రబాబు సతీమణి భువనేశ్వరి అన్నారు. 'నిజం గెలవాలి' పేరిట చేపట్టిన యాత్రలో భాగంగా బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గురువారం ఆమె ఏడు బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి పరామర్శించి ఓదార్చారు. ఒక్కొక్కరికీ రూ.3 లక్షల చొప్పున చెక్కులు అందించారు. తొలుత అమలాపురంలోని సత్యనారాయణ గార్డెన్స్‌లో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి గంటి హరీష్ మాధుర్, మాజీ ఎమ్మెల్యేలు అయితా బత్తుల ఆనందరావు, బండారు సత్యానందరావు, చిల్లా జగదీశ్వరి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర నేతలు మెట్ల రమణబాబు, అల్లాడ స్వామినాయుడు తదితరులు భువనేశ్వరిని కలిసి పుష్పగుచ్చాలు అందించారు.

- (అమలాపురం/ఆంధ్రజ్యోతి)

నేడు టూర్ ఇలా...

నిడదవోలు/బిక్కవోలు, జనవరి 25 : 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తూర్పుగోదావరి జిల్లాలో నారా భువనేశ్వరి పర్యటించనున్నారు. మండపేటలో గురువారం రాత్రి ముగించుకుని బిక్కవోలు మండలం బలభద్రపురం ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాలులో బస చేశారు. శుక్రవారం ఉదయం బిక్కవోలులోని శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుంటారు. అనంతరం అదే గ్రామానికి చెందిన రొక్కల రాణి కుటుంబీకులను పరామర్శిస్తారు. నిడదవోలు మండలం చేరుకుని పందలపర్రు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బోగిరెడ్డి సత్యనారాయణ (బూరయ్య), తిమ్మరాజుపాలెంలో కుసుమే వెంకటలక్ష్మి, కలవచర్లకు చెందిన మన్నెం శ్రీనివాసరావు కుటుంబీకులను ఓదార్చుతారు. చాగల్లు మండలం బ్రాహ్మణగూడెంలో మరొక కుటుంబాన్ని పరామర్శిస్తారు.

కన్నీళ్లు రాకుండా చూస్తాం : ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి గ్రామానికి చెందిన సలాది విశ్వనాథం భార్య ఆదిలక్ష్మి భువనేశ్వరిని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. ఆమెను పక్కనే కూర్చుని భువనేశ్వరి ఓదార్చారిలా..



బాధపడకండి.. మేమున్నాం!

బాధిత కుటుంబీకుల కన్నీళ్లు తుడిచి.. బాసటగా నిలిచి..

- కోనసీమలో 7 కుటుంబాలకు పరామర్శ
- అండగా ఉంటామని భువనేశ్వరి భరోసా
- రూ.3 లక్షల చొప్పున చెక్‌ల అందజేత

అల్లవరంలో.. సుబ్బరాజు కుటుంబానికి..



అల్లవరం, జనవరి 25 : మండలంలోని రెల్లుగడ్డ గ్రామానికి చెందిన టీడీపీ వీరాభిమాని, ఉపాధి కూలీ నడింపల్లి సుబ్బరాజు గతేడాది అక్టోబరు 1న చంద్రబాబు అరెస్టు వార్తను టీవీలో చూసి గుండెపోటుతో మృతిచెందాడు. అతడి కుటుంబీకులను భువనేశ్వరి గురువారం పరామర్శించి ఓదార్చారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, పెచ్చెట్టి చంద్రమౌళి, మాజీ జడ్పీటీసీ వేగిరాజు ప్రమీల, పెచ్చెట్టి విజయలక్ష్మి, డాక్టర్ సత్యశ్రీ, వేగిరాజు వెంకట్రాజు, చిక్కాల గణేష్ పాల్గొన్నారు.

చల్లపల్లికి వెళ్లి.. ఓదార్చి..

ఉప్పలగుప్తం : చంద్రబాబు జైల్లో ఉండగా ఆందోళనతో మృతి చెందిన చల్లపల్లి గ్రామానికి చెందిన సలాది విశ్వనాథం భార్య ఆదిలక్ష్మి, ముగ్గురు కుమార్తెలను భువనేశ్వరి పరామర్శించి ఓదార్చారు. ఆమె వెంట టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మకాయల చెల్లయ్యనాయుడు, సర్పంచ్ ఇసుకపట్ల జయమణీరఘుబాబు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అరిగెల నానాజీ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మాజీ జడ్పీటీసీ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, గొలకోటి చిన్నా, పోలిశెట్టి శివాజీ, దంగేటి రవీంద్రనాథ్, బూసి బుజ్జిదొర, పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఎస్ మూలపాలెం వెళ్లి.. పరామర్శించి



అయినవిల్లి: మండలంలోని ఎస్.మూలపొలం గ్రామానికి చెందిన మోరంపూడి మీరాసాహెబ్ కుటుంబ సభ్యులను భువనేశ్వరి పరామర్శించారు. అండగా ఉంటామని, అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. ఆమె వెంట మతుకుమిల్లి లక్ష్మణరావు, సూర్యకుమారి, సర్పంచ్ బొబ్బా ప్రభాత్‌కుమార్, మతుకుమిల్లి బాబూరావు, మందపాటి కిరణ్ కుమార్, సలాది పుల్లయ్యనాయుడు తదితరులు ఉన్నారు.

గూడపల్లి వెళ్లి కన్నీళ్లు తుడిచి..



రాజోలు: మండలంలోని గూడపల్లికి చెందిన సరెళ్ల పెద్దిరాజు కుటుంబీకులను భువనేశ్వరి పరామర్శించారు. ఆమె వెంట మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, టీడీపీ రాజోలు నియోజకవర్గ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు, ఎంపీపీ కేతా శ్రీను, మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, ముప్పర్తి నాని, వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, చాగంటి సామి, బోళ్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నల్లూరు వెళ్లారు.. ఓదార్చారు..



కపిలేశ్వరపురం : మండలంలోని నల్లూరులో జొన్నకూటి రాజు కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించారు. టీడీపీ అన్నా, చంద్రబాబు అన్నా రాజుకు అమితమైన ప్రేమ, అభిమానమని, ఎప్పుడూ చంద్రన్ననే తలుస్తూనే ఉండేవాడని కుటుంబీకులు భువనేశ్వరికి వివరించారు. ఆమె వెంట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, వి.సాయి కుమార్‌బాబు, ముత్యాల వెంకట్రావు, పుత్సల శ్రీనివాస్, పువ్వల చిట్టిబాబు, నెక్కంటి బాలకృష్ణ పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



మలికిపురం : విశ్వేశ్వరాయపురం గ్రామానికి చెందిన చెల్లుబోయిన నరసింహ మూర్తి కుటుంబీకులను భువనేశ్వరి పరామర్శించారు. 'నవంబరు 9న టీవీ ఆన్‌చేసి చంద్రబాబు అరెస్టు వార్త చూసి కుప్పకూలారని మృతుడి కుమారుడు చంద్రకాంత్ తెలిపారు. ధైర్యంగా ఉండాలని, టీడీపీ అండగా ఉంటుందని భువనేశ్వరి వారికి భరోసా ఇచ్చి రూ.3 లక్షల చెక్కు అందించారు. ఆమె వెంట మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, గ్రామ సర్పంచ్ చెల్లుబోయిన హెలీనా, సఖినేటిపల్లి టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముప్పర్తి నాని, మంగెన భూదేవి, బందెల పద్మ, కాండ్రేగుల భవానీలావణ్య తదితరులు పాల్గొన్నారు.

పాలతోడు.. మేము మీకు తోడు..



మండపేట : మండలంలోని పాలతోడులో మందపల్లి ధర్మరాజు కుటుంబీకులను భువనేశ్వరి పరామర్శించారు. ఆయన సతీమణి జ్యోతితో పాటు పిల్లలు వినీల, ప్రమీల కుమారుడు వరుణ్‌తో భువనేశ్వరి మాట్లాడి ధైర్యం చెప్పారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక తమ కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలని బాధిత కుటుంబం కోరగా భువనేశ్వరి సానుకూలంగా స్పందించారు. ఆమె వెంట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వల్లూరి సాయికుమార్‌బాబు, నల్లమిల్లి వీర్రెడ్డి, వాదా ప్రసాదరావు, యరగతపు బాబ్జీ, పాలతోడు మాజీ సర్పంచ్ పిల్లా పద్మవెంకట్రాజు ఉన్నారు.



కాకినాడలో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

కష్టపడితే అధికారం కాంగ్రెస్‌దే!

- అసెంబ్లీ ఎన్నికలు దగ్గరకొస్తున్నందున అందరూ కష్టపడి పనిచేయాలి
- ప్రతి ఇంటి తలుపుతట్టి కేడర్‌ను పార్టీలోకి ఆహ్వానించాలి
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పోలవరం ప్రాజెక్టు, రాజధాని, ప్రత్యేక హోదా
- రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం.. అంతా అరాచక పాలన నడుస్తోంది
- ఉమ్మడి జిల్లా పార్టీ కార్యకర్తల సమావేశంలో పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల

కాకినాడ సిటీ, జనవరి25: అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పీసీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపునిచ్చారు. నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రతి ఇంటి తలుపు తట్టి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించాలని దిశానిర్దేశం చేశారు. కాకినాడ సూర్యకళామందిరంలో గురువారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పీసీసీ చీఫ్ షర్మిల కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ క్రమేపీ పెరుగుతోందని, దీనిని ఓట్లుగా మల్చుకోగలిగితే తప్పకుండా అధికారంలోకి వస్తామని పేర్కొన్నారు. విభజన హామీలు అమలుచేసి రాష్ట్రానికి న్యాయం చేసేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ప్రారంభమైతే ఇప్పటివరకు ప్రభుత్వాలు దీన్ని పూర్తిచేయలేదని షర్మిల ధ్వజమెత్తారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా లేదని, రాజధాని లేదని, పరిశ్రమలు కూడా రాక అటుఇటు కాకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా శూన్యమని, అరాచక, రాక్షస పాలన నడుస్తోందని ధ్వజమెత్తారు. వైసీపీతోపాటు ప్రతిపక్ష టీడీపీ ఎంపీలు రాష్ట్రంలో ఒక ఎమ్మెల్యే, ఒక ఎంపీ సీటు కూడా గెలవని బీజేపీకి బానిసలుగా మారిపోయారని మండిపడ్డారు. రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ ద్వారానే సంక్షేమ, సుస్థిర పాలన అందుతుందని అందుకే కాంగ్రెస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కోరుకున్న ఆంధ్రప్రదేశ్ ఇది కాదని, విభజన హామీలలో పొందుపరిచిన విధంగా ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, కొత్త పరిశ్రమల ఏర్పాటుతో ఆవిష్కృతం కావాలని సోనియా, రాహుల్ భావించారన్నారు. సీడబ్ల్యూసీ సభ్యుడు జేడీ శీలం మాట్లాడుతూ పార్టీ శ్రేణులు మండల, గ్రామ, బూత్ లెవెల్ కమిటీలు ఏర్పాటుచేయాలన్నారు. ఎన్నికల్లో తూర్పుగోదావరి జిల్లా ప్రజలు ఏ పార్టీని ఆదరిస్తే ఆ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి త్వరలోనే మంచిరోజులు రాబోతున్నట్టు చెప్పారు. ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో దోచుకోవడం, దాచుకోవడం తప్పించి పరిపాలన లేదన్నారు. సీడబ్ల్యూసీ సభ్యుడు మల్లిపూడి మంగపతి పళ్లంరాజు మాట్లాడుతూ పదేళ్ల కాంగ్రెస్ పాలనలో సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి సమాంతరంగా జరిగాయని వివరించారు. కానీ ఇప్పుడు అదంతా మాయమైపోయిందన్నారు. అనంతరం కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి కొందరు పార్టీ మండల అధ్యక్షులు ప్రసంగించారు. ఈ సమావేశంలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు జంగా గౌతమ్, సుంకర పద్మశ్రీ, పీసీసీ మాజీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి, ఏఐసీసీ సభ్యుడు మల్లిపూడి రాంబాబు, కోనసీమ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, రాజమహేంద్రవరం జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, పీసీసీ ఉపాధ్యక్షుడు మట్టా ప్రసాద్, పీసీసీ ప్రధాన కార్యదర్శిలు ఆకుల వెంకటరమణ, ఎండీ ఇస్మాయిల్ ఆరిఫ్, కోలా ప్రసాదవర్మ, కుక్కల పోతురాజు, అయితాబత్తుల సుభాషిణి, కాకినాడ సిటీ అధ్యక్షుడు దాట్ల గాంధీరాజు, రాజమహేంద్రవరం సిటీ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లితో వైఎస్ షర్మిల భేటీ

రాజమహేంద్రవరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల గురువారం రాజమహేంద్రవరంలోని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్ ఇంటికి వచ్చారు. మాజీ పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి, మాజీ కేంద్రమంత్రి పళ్లంరాజు, జేడీ శీలం, మాజీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తదితరులు ఆమె వెంట ఉన్నారు. ఉండవల్లితో ఆమె ప్రత్యేకంగా సమావేశమై పలు విషయాలు చర్చించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మర్యాదపూర్వకంగా అరుణకుమార్‌ని కలిశానన్నారు. అనంతరం ఉండవల్లి స్పందిస్తూ వైఎస్ కుమార్తెగా ఆమె తనను మర్యాదపూర్వకంగా కలవడానికి వచ్చారన్నారు. కాకినాడ నుంచి వెళుతూ రాజమహేంద్రవరం వచ్చారన్నారు. ఆమెలో వైఎస్ఆర్ చొరవ కనిపిస్తోందని వ్యాఖ్యానించారు.

ఆర్టీసీకి సంక్రాంతి ఆదాయం రూ.88,50,606

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 25 : సంక్రాంతి పండుగ నేపథ్యంలో జిల్లా ఆర్టీసీకి ఈ ఏడాది రూ.88 లక్షల 50 వేల 606ల ఆదాయం లభించిందని ఆర్టీసీ జిల్లా అధికారిణి కె.షర్మిలా అశోక గురువారం తెలిపారు. జిల్లాలోని మొత్తం నాలుగు డిపోల నుంచి హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాలకు 377 స్పెషల్ సర్వీసులు నడిపామన్నారు. 30,319 మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చినట్టు తెలిపారు. రాజమహేంద్రవరం డిపో రూ.64,09,719, గోకవరం డిపో రూ.12,08, 472లు, కొవ్వూరు డిపో రూ.7,70,956లు, నిడదవోలు డిపో రూ.4,61,459ల ఆదాయం దక్కిందన్నారు.

టీచర్ ఖాతా నుంచి లక్ష స్వాహా

రాజమహేంద్రవరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఓ టీచర్ ఖాతా నుంచి దుండగులు రూ.97 వేలు స్వాహా చేశారు. రెహ్మత్‌నగర్‌కి చెందిన సుజాత డబ్బు అవసరంతో ఏటీఎం నుంచి డ్రా చేసి తీసుకురావాలని ఆమె కుమార్తెకు డెబిట్ కార్డు ఇచ్చి పంపారు. చిన్నారి షెల్టాన్ జంక్షను సమీపంలోని బొల్లినేని ఆస్పత్రి రోడ్డులోని ఏటీఎంకి వెళ్లింది. డబ్బు డ్రా చేసిన సమయంలో సరిగా తెలియకపోవడంతో అదే అదనుగా అక్కడే ఉన్న దుండగుడు గమనించి ఆ అమ్మాయికి అవసరమైన డబ్బు డ్రా చేసి ఇచ్చి కార్డు మార్చేశాడు. సాయంత్రానికి ఖాతా నుంచి రూ.97వేలు మాయమైనట్టు మెసేజ్‌లు రావడంతో బొమ్మూరు పోలీసులను సుజాత ఆశ్రయించారు.కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎండీ ఉమర్ తెలిపారు.

వచ్చే నెల 10,11 తేదీల్లో బాలోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 25 : రెండో గోదావరి బాలోత్సవం వచ్చే నెల 10,11వ తేదీల్లో ఎస్‌కేవీటీ డిగ్రీ కాలేజీలో నిర్వహించనున్నట్టు బాలోత్సవ అసోసియేట్ అధ్యక్షుడు వీఎస్ఎస్ కృష్ణకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.తులసీ తెలిపారు.రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల తో మాట్లాడారు. బాలోత్సవానికి ఎంపిక చేసిన రాజమహేంద్రవరంతో పాటు ఆరు మండలాల్లోని 700 పాఠశాలల్లో రెండో తరగతి నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు.మురళీకృష్ణ,కాశీవిశ్వనాథ్, కామేశ్వరశర్మ పాల్గొన్నారు.

29న కాతేరులో తెలుగుదేశం పిలుస్తోంది
రా కదలిరా



కోరుకొండ మండలం మధురపూడిలోని బీవీఆర్ చౌదరి క్యాంప్ కార్యాలయంలో బహిరంగ సభ ఏర్పాట్లపై చర్చిస్తున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టీడీపీ నాయకులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 29న రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం పరిధి కాతేరులో తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా బహి రంగ సభను నిర్వహిస్తారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల కార్యకర్తలు, ప్రజలు సభకు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. తిరుమల కాలేజీ ఎదురుగా సుమారు 23 ఎకరాల స్థలంలో బహిరంగ సభ నిర్వహిస్తారు. దానికి సమీపంలో 13 ఎకరాల స్థలంలో పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. వాటి ఎదురుగా గల మూడు ఎకరాల స్థలంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేస్తున్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీభర్త ఆదిరెడ్డి వాసు, రాజానగరం ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి(బీవీఆర్‌చౌదరి) తదితరులు పరిశీలించారు. అంతకు ముందు బూరుగుపూడి గేట్ వద్ద గల టీడీపీ ఆఫీసులో ముఖ్యనేతల సమావేశం జరిగింది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, శాసనమండలి విపక్షనేత యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ టీడీపీ ఎన్నికల ముందు రాజమహేంద్రవరంలో భారీ బహిరంగసభ నిర్వహించడం సంప్రదాయంగా వస్తుందన్నారు. ఈసభ సక్సెస్‌తో పార్టీ అధికారంలోకి వస్తుందనేది ఓ సెంటిమెంట్‌గా కూడా మనం చూస్తుంటామన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు ఈ సభను సక్సెస్ చేయడానికి కృషి చేయాలన్నారు.ఇక మధ్యలో రెండు రోజుల సమయమే ఉండడం వల్ల అన్ని ఏర్పాట్లు చకచకా జరగాలని, పార్కింగ్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ కాతేరులో సభ నిర్వహించడం వల్ల జిల్లా నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు అధికంగా రావడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ ఆరోజు ఉదయం 10గంటలకే సభ మొదలవుతుందన్నారు. సుమారు 2లక్షల మంది ప్రజలు వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. ఉదయం పూట జరిగే సభ కాబట్టి వచ్చిన వారందరికీ భోజనం సౌకర్యం కూడా ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. భోజనాలు వద్ద ఇబ్బంది లేకుండా సభకు అన్ని వైపులా నియోజకవర్గాల వారీ ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనేది కూడా చర్చించారు. సభ కోసం ఇన్‌చార్జిలు, పరిశీలకులను నియమించారు.అనపర్తి ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరావు, పరిశీలకుడిగా మోకా ఆనందసాగర్, రాజానగరం ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, పరిశీలకుడిగా ధూళిపూడి వెంకటరమణ, రాజమహేంద్రవరం సిటీ ఇన్‌చార్జిగా రెడ్డి సుబ్రహ్మణ్యం, పరిశీలకురాలిగా మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి, రాజమహేంద్రవరం రూరల్ ఇన్‌చార్జిగా మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, పరిశీలకుడిగా అంగర రామ్మోహన్, కొవ్వూరు ఇన్‌చార్జిగా మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, పరిశీలకుడిగా గొర్లె శ్రీధర్, నిడదవోలు ఇన్‌చార్జిగా వలవల బాబ్జి, పరిశీలకుడిగా వివిఎల్ సూర్యనారాయణరాజు, గోపాలపురం ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, పరిశీలకుడిగా కటకంశెట్టి ప్రభాకర్ నియమితులయ్యారు.


నాగబాబును కలిసిన కాపునేతలు

రాజమహేంద్రవరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : జనసేన నేత కొణిదల నాగబాబును పలువురు కాపునేతలు కలిశారు. ఇటీవల సతీవియోగంతో బాధపడుతున్న జనసేన నేత కందుల దుర్గేష్‌ను పరామర్శించడానికి వచ్చిన నాగబాబు పాత సోమాలమ్మ గుడి వీధిలో ఓ ఫంక్షన్ హాల్‌లో ఉండగా పలువురు కాపునేతలు ఆయనతో కలసి పలు విషయాలు చర్చించారు.జనసేన-తెలుగుదేశం అధికారంలోకి వస్తున్నాయని.. వైసీపీని ఓడించాలని ఆయన పిలుపు ఇచ్చినట్టు సమాచారం.

కోటి 98 మంది డేటా సేకరించాం
మంత్రి చెల్లుబోయిన వేణు

రాజమహేంద్రవరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : కులగణన ప్రక్రియలో భాగంగా ఈ వారం రోజుల్లో 89 లక్షల కుటుంబాలకు చెందిన కోటి 98 మంది డేటా సేకరించామని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణు తెలిపారు.స్థానిక 18వ వార్డులో గురువారం నిర్వహించిన గుడ్‌మార్నింగ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ఈ నెల 29వ తేదీ నాటికి కులగణన పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు.

నల్లజర్ల అటవీ ప్రాంతంలో పులి సంచారం



నల్లజర్ల అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తోంది.. దీంతో స్థానికులు భయ భ్రాంతులకు గురవుతున్నారు.. బుధవారం రాత్రి ఒక వ్యాన్ డ్రైవర్‌కు పులి కనిపించగా సమాచారం అందించాడు. గురువారం తనిఖీ చేయగా అవి పులి అడుగుజాడలేనని గుర్తించారు. ఇదిలా ఉండగా పులి సంచరిస్తున్న ఫొటోలు కెమెరాకు చిక్కినట్టు చెబుతున్నారు. - 7లో

నేడు 75వ గణతంత్ర దినోత్సవం



రాజమహేంద్రవరం మువ్వన్నెల విద్యుద్దీపకాంతుల మధ్య రైల్వేస్టేషన్

రాజమహేంద్రవరం, జనవరి 26(ఆంధ్రజ్యోతి) : భారత 75వ గణతంత్ర దినోత్సవం జిల్లా స్థాయి వేడుకలకు ఆర్ట్స్ కాలేజి వేదిక కానుంది. ఈ మేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శకటాలను సిద్ధం చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు కలెక్టర్ మాధవీలత జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. ఉత్తమ అధికారులకు అవార్డులు ఇవ్వనున్నారు.



ఘనంగా ఓటర్ల దినోత్సవం

జాతీయ ఓటర్ల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీ చేశారు. ర్యాలీని కలెక్టర్ మాదవీలత జెండా ఊపి ప్రారంభించారు. ఓటు వజ్రాయుధమని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆలోచించి ఓటేయాలని సూచించారు. అనంతరం పలువురు ఓటర్లను సత్కరించారు. ర్యాలీలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కొవ్వూరులో ర్యాలీ చేస్తున్న సబ్ కలెక్టర్ శ్రీవాస్తవ, ఇతర అధికారులు

రా కదలిరా కార్యక్రమం జయప్రదం చేయండి

● మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు


రా కదలిరా కార్యక్రమంపై సమీక్షలో మాజీ ఎమ్మెల్యే శేషారావు తదితరులు

నిడదవోలు, జనవరి 25: రాజమహేంద్రవరంరూరల్‌లో ఈనెల 29న తెలుగు దేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు రా కదలిరా కార్యక్రమంలో పాల్గొనసున్నారని ఈ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు కోరారు. గురువారం రాజమండ్రి పార్లమెంటు పరిధిలోని నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో రాజానగరం నియోజకవర్గం బూరుగుపూడి బొడ్డు వెంకటరమణ కార్యాలయంలో సమావేశం నిర్వహించారని తెలిపారు. పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, కెఎస్ జవహర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని ఆయన తెలిపారు.

రా.. కదలిరా.. బహిరంగసభను విజయవంతం చేయండి

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిపాటి


సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం, జనవరి 25: తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరం రూరల్ లో జరిగే రా.. కదలి రా.. బహిరంగసభను విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని హుకుంపేట గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల స్థాయి సమావేశాన్ని గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మద్దిపాటి మాట్లాడుతూ ఈనెల 29వ తేదీన రాజమండ్రి రూరల్‌లో రా.. కదలి రా.. బహిరంగ సభకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ముఖ్యఅతిథిగా హాజరవుతారని అన్నారు. అదేవిధంగా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నాయకులు, కార్యకర్తలు పార్టీ గెలుపే లక్ష్యంగా భావించాలన్నారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ 6పథకాలను ఇంటింటికి తీసుకెళ్ళి ప్రజలకు వివరించటంతో పాటు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి, ప్రజలకు కలిగే ప్రయోజనాలు ప్రజలకు వివరించి చైతన్యవంతులు చేయాలన్నారు. ఈసందర్భంగా హుకుంపేటలో వైఎస్సార్ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలను మద్దిపాటి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రా.. కదలి రా.. సభ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యేహైతబత్తుల ఆనందరావు, మండల అధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రమేష్, హుకుంపేట జమిందర్, టీడీపీ సీనియర్ నాయకులు హోతా రాజ, సర్పంచ్ దాకే గంగారాణి, సీనియర్ నాయకులు శరత్‌బాబు, కొర్లపాటి రాము, తదితరులు పాల్గొన్నారు.

'అవినీతి రహిత పాలనే లక్ష్యం'

కొవ్వూరు, జనవరి 25 : అవినీతి రహిత పాలన, సమాజంలో సామాజిక మార్పు తీసుకురావాలన్నదే ఆమ్ ఆద్మీ పార్టీ లక్ష్యమని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్.మణి నాయుడు, అన్నారు. గురువారం నియోజకవర్గ ఇన్‌చార్జి యంగల వరప్రసాద్ ఆధ్వర్యంలో కొవ్వూరు మెరకవీధి వాటర్‌ట్యాంకు నుంచి బస్టాండ్ సెంటర్ మీదుగా ఆర్యవైశ్య కళ్యాణ మండపం ఆమ్ ఆద్మీ పార్టీ ప్రజా వేదిక వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆమ్ ఆద్మీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్. మణినాయుడు మాట్లాడుతూ మోసపూరిత హామీలతో రాజకీయ పార్టీలు ఏపీ ప్రజలను మోసగిస్తున్నాయన్నారు. సంక్షేమం పేరుతో ఒక చేత్తో ఇచ్చినట్లే ఇచ్చి, మరో చేత్తో లాక్కుంటున్నాయన్నారు. రాష్ట్రంలో మోసపూరిత హామీల తో ప్రజలను మభ్యపెడుతూ దుర్మార్గపు పాలనను అందిస్తున్న రాజకీయపార్టీలకు గతిన బుద్ధిచెప్పే సమయం ఆసన్నమైందన్నారు. భావితరాల బంగారు భవిష్యత్‌కై ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు అరవింద్ కేజ్రీవాల్ నిలబెట్టిన అభ్యర్థులను గెలిపించి అసెంబ్లీకి పంపించాలన్నారు. కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ రాష్ట్ర లీగల్ సెల్ సభ్యులు మన్నవ రఘురాం, రాష్ట్ర కన్వీనర్ చీరా రమేష్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోకల వరదరాజుల సొంచి, కాకినాడ జిల్లా జాయింట్ సెక్రటరి ఎస్.బి. రామారావు, ఐ.టి. సెల్ నాయకులు జాన్‌రామ్, జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ శ్రీనివాస్, సుమలత, నరాల శివ పాల్గొన్నారు.

పద్యవిభాగంలో రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డులు


విద్యార్థులను అభినందిస్తున్న తహసీల్దార్ కనకరాజు

ఉండ్రాజవరం, జనవరి 25 : సైనిక వీరుల ధైర్యసాహసాలు, వారి జీవిత గాధలను తెలుసుకుని రాయడంలోను, కేంద్ర రక్షణశాఖ, విద్యాశాఖలు నిర్వహించిన రాష్ట్రస్థాయి పద్య విభాగంలో తమ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని కె. పావని, జిల్లాస్థాయి పద్యవిభాగంలో కె. నవ్యశ్రీలు ఎంపికైనట్లు ఉండ్రాజవరం హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు వి. విశ్వప్రసాద్ గురువారం తెలిపారు. వీరికి రాష్ట్రస్థాయిలోను, జిల్లాస్థాయిలో బహుమతులు పొందేందుకు ఆహ్వానాలు అందినట్లు ఆయన చెప్పారు. అవార్డులు గెలుచుకున్న ఇద్దరు విద్యార్థులకు తహసీల్దార్ జి.కనకరాజు వెయ్యిరూపాయలు చొప్పున బహుమతి అందజేశారు. వీరిని తీర్చిదిద్దిన పాఠశాల ఉపాధ్యాయుడు జి.మహేష్‌కుమార్‌ను, విద్యార్థులను ఎంఈవో సక్సేనరాజు, వీఆర్వో వి.పాపారావు, ప్రధానోపాధ్యాయుడు విశ్వప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ముందుంటాం

దేవరపల్లి, జనవరి 25: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడా నికి జనసేన, టీడీపీ ఎప్పుడు ముందుంటాయని మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ సువర్ణరాజు అన్నారు. దేవరపల్లి మండలం యాదవోలు గ్రామంలో ఇటీవల మృతి చెందిన అనిశెట్టి సీతారామయ్య, తంగెళ్ళ సీతమ్మ కుటుంబాలకు రూ.10వేలు జనసేన, టీడీపీ ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో మా జీ మండల టీడీపీ అధ్యక్షుడు కొయ్యలమూడి చినబాబు, సుంకర దుర్గారావు, టీడీపీ నేతలు గద్దే సుబ్రహ్మణ్యం, అనిశెట్టి శ్రీనివాస్, అనిశెట్టి మధు, టీడీపీ సీనియర్ నాయకులు అనిశెట్టి ప్రభాకరరావు, మణికంఠ, టీడీపీ, జనసేన నేతలు, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యం


ముక్కామలలో భోగవల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో జనసేనలో చేరిన కార్యకర్తలు

పెరవలి, జనవరి 26: బీసీలకు రాజ్యాధికారమే జనసేన లక్ష్యమని నిడదవోలు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి భోగవల్లి ప్రసాద్ పేర్కొన్నారు. ముక్కామలలో జరిగిన కార్యక్రమంలో ఆ గ్రామానికి చెందిన బీసీలు, దళితులు సుమారు 60 మంది జనసేనలో చేరారు. ఈ సందర్భంగా సంక్రాంతికి జనసేన ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను సమర్థవంతంగా నిర్వహించినందుకు గ్రామ కమిటీ అధ్యక్షుడు రేలంగి రాజేష్ తదితరులు అభినందించారు.

కాశీవిశ్వనాధుడికి ప్రత్యేక పూజల

కొవ్వూరు, జనవరి 25 : కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని ప్రధాన క్షేత్రంలో ఉన్న కాశీవిశ్వనాధుని సన్నిధిలో పౌరణమిని పురస్కరించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. గురువారం పౌర్ణమి సందర్భంగా సహస్ర ఘటాభిషేకం, దీపోత్సవం, అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్టను పురష్కరించుకుని సీతారాముల పూజ చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీవారికి రాష్ట్ర హోంమంత్రి వనిత పూజలు

ద్వారకాతిరుమల, జనవరి 25 : శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని రాష్ట్రహోం మంత్రి తానేటి వనిత గురువారం సందర్శించారు, ఆలయానికి విచ్చేసిన ఆమెకు ఆలయ అధికారులు, అర్చకులు దేవాలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. తొలుత ఆమె ఆలయ ప్రాంగణంలో అర్చకుల వేదమం త్రోచ్చరణల నడుమ ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవా ర్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో త్రినాథరావు ఆమెకు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందించారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, ఎంపీపీ బొండాడ మోహినీవెంకన్నబాబు ఉన్నారు.

నూరుశాతం ఓటు హక్కు వినియోగించుకోవాలి

● కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ
● ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం


కొవ్వూరు పట్టణంలో ఓటరు అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ


నిడదవోలులో సీనియర్ సిటిజన్లను సత్కరిస్తున్న దృశ్యం


గోపాలపురంలో సీనియర్ సిటిజన్లను సత్కరిస్తున్న దృశ్యం


తాళ్లపూడి: ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో, డిప్యూటీ తహసీల్దార్ తదితరులు

కొవ్వూరు, జనవరి 25: ఎన్నికలలో నూరుశాతం ఓటు హక్కు వినియోగించుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా స్థానిక విజయవిహార్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ పురవీధులలో అంగన్‌వాడీ వర్కర్లు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ట్రైనీ కలెక్టర్ సి.యశ్వంత్‌రెడ్డి, అంగన్‌వాడీ వర్కర్లు, విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సీనియర్ ఓటర్లను సత్కరించి, కొత్తఓటర్లకు గుర్తింపు కార్డులు అందజేశారు. జాతీయఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నలుగురు బూత్‌లెవిల్ అధికారులకు ఉత్తమ అవార్డులను అందించారు. సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం భారత దేశం అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును వినియోగించుకోవడం ద్వారా మంచి నాయకులను ఎన్నుకోవచ్చునన్నారు. రానున్న ఎన్నికలలో కొవ్వూరు రెవెన్యూ డివిజన్‌లో 100శాతం ఓటు వినియోగించుకునే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటు హక్కుపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు, చాగల్లు తహసీల్దార్‌లు బి.నాగరాజు నాయక్, కె.రాజ్యలక్ష్మి, పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ బి. శ్రీకాంత్, మున్సిపల్ మేనేజర్ జి.రాధాకృష్ణ, ఐసీడీఎస్ సీడీపీవో డి.మమ్మీ, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ హేమ పాల్గొన్నారు.

తాళ్ళపూడి: తాళ్ళపూడిలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవడం మన ప్రాథమిక హక్కు అని ప్రతిపౌరుడూ తన ఓటును విధిగా కలిగి ఉండాలని మన ఓటే మన ఆయుధమని మన ఓటు మన భవిష్యత్ అని పలువురు తమ ప్రసంగాలలో తెలిపారు. తాళ్ళపూడి బస్టాండు నుంచి ఏర్పాటుచేసిన ర్యాలీలో ఎంపీడీవో వెంకట రమణ, డిప్యూటీ తహసీల్దార్ భారతి, ఈవోపీఆర్డీ వీరన్న, తాళ్ళపూడి కార్యదర్శి ఆశాఅలేఖ్య, తదితర ప్రభుత్వ అధికారులు, సచివాలయ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం తాళ్ళపూడి మండలంలో తదితర పంచాయతీలలో సీనియర్ ఓటర్లను సత్కరించారు.

సీనియర్ సిటిజన్‌లకు సత్కారం

నిడదవోలు: నిడదవోలు పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్స వం పురస్కరించుకుని రాజకీయపార్టీల ప్రతినిధుల ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్‌లను సత్కరించారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎమ్.ఝాన్సీరాణి, రాజకీయపార్టీల ప్రతినిధులు, సీనియర్ సిటిజన్స్ తహసీల్దార్ ఎమ్.గంగరాజు పాల్గొన్నారు.

గోపాలపురం: భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధం లాంటిదని నియోజకవర్గ ఓటు నమోదు అధికారి ఎం.వెంకటసుధాకర్ అన్నారు. 14వ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఈఆర్‌వో వెంకటసుధాకర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉత్తమమైన నాయకుడ్ని ఎన్నుకునేందుకు ఓటు కీలకమన్నారు. దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల, గోపాలపురం మండలాల్లోని విద్యార్థులకు ఓటు విలువ గురించి వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రసంశాపత్రాలు అందజేశారు. బీఎల్‌ఓ, కంప్యూటర్ ఆపరేటర్లకు ప్రసంశా పత్రాలు అందజేశారు. అనంతరం సీనియర్ సిటిజన్స్‌ను సత్కరించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల తాహసీల్దార్‌లు, డిప్యూటీ తాహసీల్దార్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

పెరవలి: ప్రతీఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగించుకోవాలని తహశీల్దార్ రాజరాజేశ్వరి పేర్కొన్నారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా పెరవలిలో సీనియర్ ఓటర్లకు ఆమె సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటు హక్కు ఎంతో పవిత్రమైనదని ప్రజాస్వామ్యంలో ప్రజా ప్రతినిధులను ఎన్నుకునేందుకు ఓటు హక్కును అందరూ సద్వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు, అధికారులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



కొవ్వూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పింఛన్‌దారులు

కొవ్వూరు, జనవరి 25: పెండింగ్‌లో ఉన్న పింఛనుదారుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం అధ్యక్షుడు మడిచర్ల రామచంద్రరావు డిమాండ్ చేశారు. కొవ్వూరు తహశీల్దార్ కార్యాలయంవద్ద గురువారం కొవ్వూరు మండలం రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయ సూపరింటెండెంటు అజయ్‌కు వినతిపత్రం అందజేశారు. రామచంద్రరావు మాట్లాడుతూ 11వ పీఆర్‌సీలో 2022 జనవరి 1 నుంచి తగ్గించిన అడిషనల్ క్వాంటమ్‌ను తిరిగి యథావిధిగా అంతకుముందు ఇస్తున్నట్లు 70 సంవత్సరాలు నిండిన వారికి 10 శాతం, 75 సంవత్సరాలు నిండిన వారికి 15 శాతం పునరుద్ధరించాలన్నారు. 11వ పీఆర్‌సి ఎరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో కె. సుబ్బారావు, రమేష్‌రాజు, మదీనా బాషా, మూర్తిరాజు, రిటైర్డ్ పింఛనుదారులు పాల్గొన్నారు.

చాగల్లు: ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం డీటీ నిరంజన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా మండల పెన్షనర్లు అసోసియేషన్ నాయకులు వెత్సా గంగాధరం మాట్లాడుతూ పెన్షనర్లు అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు డి.నాగేశ్వరరావు, కేఎస్ఎన్ మూర్తి, కె. సత్యవాణి పాల్గొన్నారు.

ప్రతి మనిషి ఓర్పు, సహనంతో ఉండాలి

● కొవ్వూరు ఆర్టీసీ డిపో మేనేజర్ కుమార్


ఆర్టీసీ డ్రైవర్ల కుటుంబ సభ్యులకు రవిక, తాంబూలం అందజేస్తున్న సిబ్బంది

కొవ్వూరు, జనవరి 25 : ప్రతిమనిషి ఓర్పు, సహనం, మంచి ఆలోచనలతో ఉంటే కుటుంబం, సమాజం ఆ సంస్థ బాగుంటాయని కొవ్వూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వై.వి.వి.ఎన్.కుమార్ అన్నారు. గురువారం కొవ్వూరు ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని యాక్సిడెంటు చేసిన డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. డిపో మేనేజర్ కుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బంది విధినిర్వహణకు వచ్చేటప్పుడు ఏ విధమైన ఒత్తిడి లేకుండా, ప్రశాంతంగా చిరునవ్వుతో పంపించాలన్నారు. ఆరోగ్యం విషయంలో అశ్రద్ధచేయకుండా పీరియాడికల్ చేయించుకోవాలన్నారు. మనిషి ప్రశాంతతే అన్ని పనులకు మూలమన్నారు. కౌన్సిలింగ్ అనంతరం స్వీట్స్ మహిళలను ఆడపడుచులుగా భావించి వారికి తాంబూలం అందజేశారు.

కార్యదర్శి సస్పెన్షన్

కడియం, జనవరి 25: విధి నిర్వహణలో సక్రమంగా వ్యవహరించ లేదని కడియం మండలం దుళ్ళ ఇన్‌చార్జి కార్యదర్శి డి.విజయరాజును సస్పెండ్ చేస్తూ జిల్లా గ్రామ పంచాయతీ అధికారి జె.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. కడియపులంక కార్యదర్శిగా చేసిన సమయంలో విధులకు సక్రమగా హాజరుకావడంలేదని, రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదని తదితర విషయాలపై వచ్చిన ఫిర్యాదు మేరకు అక్కడ బాధ్యతలు తొలగించి డిప్యూటేషన్‌పై దుళ్ళ కార్యదర్శిగా నియమించారు. ఇటీవల కడియపులంకలో చేపట్టిన విచారణపై సహకరించలేదని, రికార్డులు చూపలేదని తదితర అంశాలపై కార్యదర్శి డి. విజయరాజును సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో కె రత్నకుమారి తెలిపారు.

టీడీపీ టిక్కెట్‌ను స్థానికులకే కేటాయించాలి


మంగళగిరి టీడీపీ కార్యాలయానికి వెళ్లిన కొవ్వూరు నియోజకవర్గ దళిత నాయకులు

కొవ్వూరు, జనవరి 25 : కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ టిక్కెట్‌ను స్థానికులకే అందించాలని స్థానిక దళిత నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కొవ్వూరు నుంచి మంగళగిరి టీడీపీ కార్యాలయానికి తరలివెళ్లారు. పార్టీలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న కార్యకర్తలను గుర్తించి రానున్న ఎన్నికలలో టిక్కె ట్ కేటాయించాలని పార్టీ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. టి.డి.జనార్దన్‌ను కలిసి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులను వివరించారు. కార్యక్రమంలో వేమగిరి వెంకట్రావు, రాపాక సుబ్బారావు, పెనుమాక జయరాజు, ఎ.రాజేంద్రప్రసాద్, కొప్పాక జవహర్, కొల్లి రమేష్, టీడీపీ దళిత నాయకులు పాల్గొన్నారు.

అఖండ గోదావరి మాతకు మహా నీరాజనం

కొవ్వూరు, జనవరి 25 : అఖండ గోదావరి మాతకు మహా నీరాజనం అందించారు. కొవ్వూరు గోదావరి నీరాజన సమితి అధ్యక్షుడు కలిగొట్ల కృష్ణారావు ఆధ్వర్యంలో గురువారం పౌర్ణమిని పురష్కరించుకుని గోష్పాదక్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టంలో ఉన్న గోదావరిమాతకు 220వ మాసోత్సవ నీరాజనంలో భాగంగా అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. గౌతముడు, గోవు, గోదావరిమాతకు విశేష పూజలు చేశారు. అనంతరం అఖండ గోదావరిమాతకు వివిధ రకాల హారతులు అందించారు. కార్యక్రమంలో కొవ్వూరు పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ధాన్యపు కుచ్చులతో అమ్మవారికి అలంకరణ



కొవ్వూరు, జనవరి 26 : కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ఉన్న శ్రీబాలాత్రిపుర సుందరి సమేత సుందరేశ్వర స్వామి ఆలయంలో గురు పుష్యయోగం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్యమాస పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం బాలా త్రిపుర సుందరీ అమ్మవారిని ధాన్యపు కుచ్చులతో విశేష అలంకరణ చేసి అర్చనలు, సామూహిక కుంకుమ పూజలు చేశారు.

నరసింహస్వామి ఆలయంలో కుందుల పూజలు


తీపర్రులో నరసింహస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న కుందుల

పెరవలి, జనవరి 26 : టీడీపీ నాయకుడు కుందుల వీర వెంకట సత్యనారాయణ గురువారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిన్నటివరకు ఆయన హైదరాబాద్‌లో ఉండి ఈరోజు పెరవలి, నిడదవోలు మండలంలో పలు ఆలయాలను దర్శించుకోవడంపై పలువురు పలు విధాలుగా చర్చించుకుంటున్నారు. ఆయన అభిమానులు మాత్రం తమ నాయకుడికి అధిష్టానం నుంచి వచ్చిన హామీ మేరకు ఈ విధంగా ఆలయాలను దర్శించుకున్నట్లు చెబుతున్నారు. ఈ విషయమై నియోజకవర్గంలో పలు విధాలుగా చర్చించుకుంటున్నారు.

పదేళ్ల తరువాత వనిత నల్లజర్ల రాక



నల్లజర్ల, జనవరి 25 : 2009 నుంచి 2013 వరకు గోపాలపురం ఎమ్మెల్యే గా పనిచేసి అనంతరం కొవ్వూరు ఎమ్మెల్యేగా గెలిచి హోం మంత్రి అయిన తానేటి వనిత సరిగ్గా పది సంవత్సరాల తరువాత మళ్లీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు గురువారం గోపాలపురం నియోజకవర్గంలోని నల్లజర్ల విచ్చేశారు. ముందుగా నల్లజర్ల సెంటర్‌లో ఉన్న వినాయకుడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. 200కార్లతో భారీ ర్యాలీగా నల్లజర్ల నుంచి ద్వారకాతిరుమల వెళ్లారు. కార్యక్రమంలో గన్నమని వెంకటేశ్వరరావు(జీవి)మద్దిపాటి ప్రసాద్, కారుమంచి రమేష్, వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం ,సర్పంచ్ పల్లి జ్యోతి, పల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 5 నుంచి జాతీయస్థాయి గిరిజన సాంస్కృతిక ఉత్సవాలు

● ట్రైబుల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు అక్కులప్పనాయక్


ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, జనవరి 25: జాతీయస్థాయి గిరిజన సాంస్కృతిక ఉత్సవాలు ఫిబ్రవరి5వతేదీ నుంచి రెండురోజులపాటు జరుగుతాయని ట్రైబల్‌స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు కె.అక్కులప్పనాయక్ తెలిపారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో వీసీ ఆచార్య కె.పద్మరాజు గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా అక్కులప్పనాయక్ మాట్లాడుతూ ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయకమిటీ ఆధ్వ ర్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలనుంచి ఆదివాసీగిరిజన కళాకారులచే గిరిజన సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం లోని ఎన్టీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఈ కార్యక్రమాలు జరుగుతాయని అక్కులప్పనాయక్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉపముఖ్య మంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడికరాజన్నదొర, గిరిజన ఎమ్మెల్యేలు. స్థానిక ఎమ్మెల్యే జక్కంపూడిరాజా, వైసిపిసిజీసీ సభ్యులు జక్కంపూడి విజయలక్ష్మి, నన్నయ వీసీ, రిజిస్ట్రార్ అధ్యాపకులు తదితరులు పాల్గొంటారని చెప్పారు. రాజానగరం, రాజమండ్రి ప్రజలు ఈ ఉత్సవాలను, గిరిజన సాంస్కృతిక వైవిధ్యాలను వీక్షించి ఆనందించాలని కోరారు. కార్యక్రమంలో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిభాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శివిష్ణునాయక్, రాజ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్‌దొర, జాన్‌వెస్లీ, చిన్నా, నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధ్యాప కులు విజయనిర్మల పాల్గొన్నారు.

ఉభయగోదావరి జిల్లాల్లో అత్యధిక సీట్లు సాధించాలి

● వైసీపీ ఉభయగోదావరి జిల్లాల కోఆర్డినేటర్ మిథున్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మిదున్‌రెడ్డి

కొవ్వూరు, జనవరి 25 : ఉభయ గోదావరి జిల్లాలలో టీడీపీ, జనసేన కలసివచ్చినా వైసీపీ అత్యధిక సీట్లు వస్తాయని వైసీపీ ఉభయగోదావరి జిల్లాల కోఆర్డినేటర్ మిదున్‌రెడ్డి అన్నారు. కొవ్వూరు యువరాజ్ కళ్యాణ మండపంలో వైసీపీ జిల్లా అధ్యక్షు డు జక్కంపూడి రాజా అధ్యక్షతన గురువారం కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. మిదున్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ అదిష్టానం సర్వేలు, సమీకరణలు ఆధారంగా కొవ్వూరు, గోపాలపురం అభ్యర్థులను మార్పు చేయడం జరిగిందన్నారు. కొవ్వూరు శాసనసభ్యులు, హోంమంత్రి తానేటి వనితను గోపాలపురం, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కొవ్వూరుకు పంపించామన్నారు. రానున్న ఎన్నికల్లో కొవ్వూరు, గోపాలపురం 2 సీట్లు గెలిచి జగన్మోహనరెడ్డికి గిఫ్టుగా ఇవ్వాలన్నారు. ఏ సర్వే చూసినా ఉభయ గోదావరి జిల్లాలలో అత్యధిక సీట్లు వైసీపీకి వస్తాయన్నారు. ఈనెల 30వ తేదీన ఏలూరులో ఎన్నికల సన్నాహక సభ జరుగుతుందన్నారు. ఆ సభలో జగన్మోహనరెడ్డి దిశ నిర్దేశం చేస్తారన్నారు. ప్రభుత్వ సలహాదారులు ఎస్.రాజీవ్‌కృష్ణ మాట్లాడుతూ గత 2019 ఎన్నికల్లో ఎంత కష్టపడి పనిచేశామో అదేవిదంగా రానున్న ఎన్నికల్లో కష్టపడి తలారి వెంకట్రావును గెలిపించాలన్నారు. మిదున్‌రెడ్డిని గజమాలతో సత్కరించి, మెమొంటో అందజేశారు. ఈ సమావేశంలో హోంమంత్రి తానేటి వనిత, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోసు, గన్నమని వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, జి.ఎస్.నాయుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారిలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కోడూరి శివరామకృష్ణ, కంఠమని రమేష్, బండి పట్టాభి రామారావు, రుత్తల భాస్కరరావు, చౌటిపల్లి వీరన్న, ఎంపిపిలు, జడ్పీటీసీలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం నియోజకవర్గం

వైసీపీ ఇన్‌చార్జిగా హోంమంత్రి వనిత

దేవరపల్లి, జనవరి 25: గోపాలపురం నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్‌గా రాష్ట్ర హోంశాఖమంత్రి తానేటి వనిత నియమితులయ్యారు. గురువారం దేవరపల్లి మండలం యర్నగూడెం గ్రామంలో పార్టీ కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యేను నియోజకవర్గాలను మార్చారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా, మంత్రి తానేటి వనితను గోపాలపురం నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. కార్యక్రమంలో గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ), ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, జడ్పీటీసీ స్వర్ణలత, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.